J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 3 24.6.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



### జగన్ ఇటు.. కేసీఆర్ అటు

# కలహం దిశగా స్నేహం



## రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరి దారి వారిదే

### మోడీకి అనుకూలంగా జగన్, వ్యతిరేకంగా కేసీఆర్

### గతంలో నోరుజారి నాలుక కరుచుకున్న కేటీఆర్

### జగన్‌ని 'వాడు' అని సంబోధిస్తూ.. ఆంధ్రులపైన తాజాగా మాటల బాణాలు సంధించిన తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

### రెండు రాష్ట్రాల మధ్య క్రమేణా పెరుగుతున్న వైరం

**అన్నదమ్ముల్లా కలసి ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల మధ్య క్రమేణా వైరం పెరుగుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. నిన్నటి వరకు తమది ఒకే మాట, ఒకే బాట అని చెప్పిన ఇద్దరు ముఖ్యమంత్రుల దారులు ఇప్పుడు వేరయ్యాయి. కేసుల వేడిని తగ్గించుకునే ప్రయత్నంలో కమలం నీడలో జగన్ తల దాచుకోవాలనుకుంటుంటే, కేసీఆర్ మాత్రం తాడో పేడో తేల్చుకుంటానంటూ కమలంతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు.**

రాష్ట్రపతి పదవికి త్వరలో జరగనున్న ఎన్నిక రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయంగా చిచ్చురేపేటట్లు కనిపిస్తోంది. ఆంధ్రాలో జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణమే కనిపిస్తూ వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రులూ ఒకరి నివాసానికి మరొకరు వెళ్లి పరస్పరం విందులు కూడా ఇచ్చుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య రోడ్డున పడాల్సినంత సమస్యలు ఏమీ ఇప్పటి వరకు పెద్దగా ఎదురు కాలేదు.

ఇప్పుడు, రాష్ట్రపతి పదవికి జులై 18న జరగాల్సి ఉన్న ఎన్నిక... ఇద్దరు ముఖ్యమంత్రుల స్థాయిలో విభేదాలు సృష్టిస్తాయేమో అన్న అనుమానాన్ని పరిశీలకులు వ్యక్తపరుస్తున్నారు. ఎందుకంటే ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్ ప్రధాని బాటలో నడుస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానికి వ్యతిరేక బాటలో ముందుకు సాగుతున్నారు.

ద్రౌపది ముర్ము అనే బీజేపీ గిరిజన మహిళా నేతను రాష్ట్రపతి అభ్యర్థిగా తెరమీదకు తీసుకు వచ్చారు ప్రధాని మోడీ. జగన్ ఆమె అభ్యర్థిత్వానికి మద్దత్తు తెలుపుతున్నారు (అధికారికంగా ప్రకటించాల్సి ఉంది).

దేశంలోని ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా 10లో

### వెంకయ్య విషయంలో..

## అనుకున్నదే అయ్యింది

భోగాది వేంకట రాయుడు 'మనలో మాట' 11లో





### ముగిసిన

# ఆత్మకూరు బైపోల్


- ప్రశాంతంగా ఉపఎన్నిక
- 64.17 శాతం పోలింగ్

*మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మృతితో వచ్చిన ఆత్మకూరు ఉపఎన్నిక ఎట్టికేలకు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 7 మండలాలలో 10 మందికి పైగా మంత్రులు, 20 మంది శాసన సభ్యులు, ఇద్దరు యంపీలు భారీ మెజారిటీ 'లక్ష్యంగా రెండువారాలుగా శ్రమించారు. ఇక్కడ భాజపా, ఇండిపెండెంట్లు తప్ప గట్టి పోటీయే లేదు. పోలింగ్ శాతం పెరిగితే అధినేత పెట్టిన మెజారిటీ 'లక్ష్యం పెద్ద విషయమే కాదు. కానీ ఎవరూ తగ్గలేదు. 'తగ్గేదే లే' అన్నట్లుగా కష్ట పడ్డారు. అనుకున్న లక్ష్యం సాధిస్తే ఎవరికి వారే తమ ఖాతాలో వేసుకుని అధినేత దగ్గర మార్కులు కొట్టేయడానికి సిద్ధంగా ఉన్నారు. అధికార యంత్రాంగం కూడా తమవంతు కష్టం తాము పడ్డారు. బలమైన ప్రత్యర్థి లేకపోయినా, భారీ స్థాయిలో అధికార గణం, వందల స్థాయిలో పోలీసు దళం, గట్టి నిఘాపెట్టి, తమ ధర్మం తాము పాటించి ఎన్నిక సజావుగా జరిగేలా చూశారు.*

### జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు :

దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణంతో ఆత్మకూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అవసరమైంది. మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా వైఎస్సార్సీపి అభ్యర్థిగా గౌతమ్ సోదరుడు, మేకపాటి విక్రమ్‌రెడ్డి పోటీ చేయగా, బిజెపి అభ్యర్థిగా భరత్‌కుమార్ రంగంలోకి దిగారు. మరో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉప ఎన్నిక నిర్వహణకు ఎన్నికల యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకొంది. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ హరేంధిరప్రసాద్, జిల్లా ఎస్పీ 10లో





# నృసింహుని సేవలో.. మంత్రి పెద్దిరెడ్డి



రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 19న జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆలయ అర్చకులు మంత్రిని ఆశీర్వదించారు. రాపూరు మండల వైకాపా నాయకుడు దుగ్గిరెడ్డి నార సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిమ గిరిజన గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

జిల్లాలోని ఆదిమ గిరిజన కులాల్లో 2022-23 సంవత్సరానికి 3వ తరగతితో పాటు, ఇతర తరగతుల్లో ఉన్న ఖాళీసీట్లకు అర్హులైన వారు దరఖాస్తులు పంపుకోవాలని, జులై 4వ తేది లోపు వారు తమకు దరఖాస్తులు అందజేయాలని ఐటిడిఏ పి.ఓ రాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఆయా గురుకులాల్లోని ప్రధానాచార్యులను సంప్రదించాలన్నారు. గూడూరు, సోమశిల బాలుర గురుకులాల్లో 3వ తరగతిలో 160 సీట్లు, ఇతర తరగతుల్లో 595 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు.



# యువతకు ఉద్యోగాలివ్వలేని ప్రభుత్వం

## టిడిపి నాయకుడు కోటంరెడ్డి శీనయ్య ధ్వజం

యువతకు ఉద్యోగాలిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్ళవుతున్నా ఆ విషయం పట్టించుకోవడం లేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడంలో సిఎం విఫలమయ్యారని టిడిపి నెల్లూరు నగర నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 20న ఆయన తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు ఆధ్వర్యంలో యువజన విభాగం నెల్లూరు నగర నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. అధ్యక్షునిగా బావిశెట్టి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా షేక అల్లాభక్షుతో పాటు 19 మందితో ఆ కమిటీని ఏర్పాటుచేశారు. నిరుద్యోగుల నడ్డివిరుస్తున్న వైకాపాను గద్దెదింపాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు కువ్వారపు బాలాజీ, షేక్ మొయినుద్దీన్, బ్రహ్మనాయుడు, హనుమంతరావు, వేణు, రఫీ, వసీం తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా..

# గంగమ్మతల్లి బ్రహ్మోత్సవాలు



వింజమూరు మండలంలోని గుండెమడకల గ్రామంలో ఇటీవల రెండురోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని కన్నులపండువగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఈనెల 19న తప్పెట్లు తాళాలతో, బాణసంచా వేడుకలతో అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఉత్సవాల కార్యనిర్వాహకులు బొర్రాల శ్రీనివాసులుయాదవ్, కొండయ్యల పర్యవేక్షణలో అమ్మవారి బ్రహ్మోత్సవ సంబరాలు నయనానందకరంగా సాగాయి.

## శ్రీశ్రీ కళావేదిక..

# జిల్లా అధ్యక్షునిగా నరేంద్రబాబు




శ్రీశ్రీ కళావేదిక నెల్లూరు జిల్లా శాఖ జిల్లా అధ్యక్షునిగా నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి గుండాల నరేంద్రబాబు నియమితులయ్యారు. ఇటీవల ఆ వేదిక నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కళావేదిక ఛైర్మెన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఈశ్వరీభూషణం, రాష్ట్ర అధ్యక్షులు గుత్తా సర్వోత్తమనాయుడు పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఏ.మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా దువ్వూరు సుమలత, కార్యదర్శులుగా అనూరాధ రామకృష్ణ, కామంచి శారద, నిర్వాహక కార్యదర్శిగా సిహెచ్ బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా సోమా పద్మారత్నం నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక కళా సామాజిక సేవాసంస్థగా శ్రీశ్రీ కళావేదిక మంచిపేరు పొందిందని, అన్ని జిల్లాల్లోనూ శాఖలు ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. జిల్లాలోనూ త్వరలో సాహితీ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## వైఎస్సార్ బీమాకు..

# నమోదు చేసుకోండి

జిల్లాలోని సచివాలయాల్లో 2022-23 సంవత్సరానికి వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమం చేపడుతున్నామని, బియ్యం కార్డు ఉండి అర్హులైన వారంతా ఈ బీమాకు నమోదు చేసుకోవాలని, ఇది పూర్తిగా ఉచితమని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సహజ మరణానికి లక్ష రూపాయలు, ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు బీమా ఈ పథకం కింద వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.



# చదువుల తల్లి ముద్దుబిడ్డలు

- ఇంటర్‌లో సత్తా చాటుకున్న బాలికలు
- రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిన నెల్లూరు

***ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరుజిల్లా మంచి స్థానాలనే సాధించింది. ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో రాష్ట్రంలో 3వ స్థానం, ఫస్ట్‌ఇయర్ పరీక్షల్లో 4వ స్థానంలో నిలిచింది. సీనియర్ ఇంటర్‌లో 73 శాతం ఉత్తీర్ణతతో బాలికలే ముందంజలో ఉండడం విశేషం. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌లో 58 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రస్థాయిలో 4వ స్థానం సాధించింది. ఇందులో కూడా బాలికలదే ఎక్కువ ఉత్తీర్ణత. రెండేళ్ళపాటు కరోనా సంక్షోభం తర్వాత ఇంటర్‌బోర్డు కొద్దిరోజుల్లోనే ఒకేసారి ఈనెల 22న విడుదల చేసిన ఈ ఫలితాలు విద్యార్థిలోకంలో కొంత ఊరట కలిగిస్తున్నాయి.***

జిల్లాలో ఈసారి ఇంటర్ పరీక్షల్లో జిల్లాకు కొంత ఊరడింపు లభించింది. గత ఏడాది ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించింది. ఇప్పుడు కూడా అదేస్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రథమ సంవత్సర పరీక్షల్లో గత ఏడాది 5వ స్థానంలో ఉన్న జిల్లా ఈసారి 4వ స్థానానికి రావడం విశేషం. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 25,374 మంది విద్యార్థులు హాజరైతే వారిలో 12,844 మంది బాలురు, 12,530 మంది బాలికలు ఉన్నారు. వీరిలో బాలురు 7711 మంది, బాలికలు 7080 మంది ఉండగా, బాలురు 55 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 62 శాతం ఉత్తీర్ణత సాధించి బాలుర కంటే ఓ మెట్టు పైగానే ఉండడం విశేషం. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 25,576 మంది హాజరైతే అందులో బాలురు 13,175 మంది, బాలికలు 12,401 మంది ఉన్నారు. బాలురు 8177 మంది, బాలికలు 9013 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 62 కాగా, బాలికలు 73 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలోనూ బాలికలదే హవా. ఎంతో కష్టపడి చదువుకుని చదువుల తల్లి ముద్దుబిడ్డలుగా ఎదుగుతున్న ఈ విద్యార్థులందరినీ ఉన్నతాధికారులు అభినందించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలలు గత ఏడాది కన్నా ఈసారి కాస్తంత వెనుకబడ్డాయనే చెప్పవచ్చు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 33.70 శాతం మాత్రమే. ద్వితీయ సంవత్సరంలో కాస్త మెరుగ్గా 48.02 శాతం సాధించుకున్నాయి. ఏదేమైనా ఈసారి ఇంటర్ ఫలితాలు ఆశాజనకంగానే ఉన్నాయి.

## మునిసిపల్ విద్యార్థులు.. భేష్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని మునిసిపల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మంచి ఫలితాలు సాధించి అందరి అభినందనలు అందుకుంటున్నారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు మొత్తం 123 మంది హాజరైతే, అందులో 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులోనూ ఎంపిసిలో జె.పావని 974 మార్కులు సాధించడం విశేషం. అదేవిధంగా ఎంవిఎస్ అమృత్‌సాయి 966 మార్కులు, బి.సుధారాణి 964 మార్కులతో ఉత్తమంగా రాణించారు. బైపిసిలో టి.సుప్రియ 903 మార్కులు, ఎస్‌కె షహిస్త 889, యోగశ్రీ 886 మార్కులతో ముందంజ వేశారు. ఎంపిసిలో ఎస్‌కె షరీన్ 458, ఎస్‌కె హమీదా పర్వీన్ 456, బి.మానస్‌కుమార్ 451, బైపిసిలో ఎస్‌కె నదియా 424, ఎం.డి మిష్బా 411, ఎస్‌కె రిజ్వానా 409 మార్కులు సాధించి అధ్యాపకుల ప్రశంసలు అందుకున్నారు.

# మన సుబ్బరామిరెడ్డికి 'సిడబ్ల్యుసి'లో శాశ్వత స్థానం

- ఉత్తర్వులిచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ
- చాలా కాలం తర్వాత తెలుగువారికి గుర్తింపు



కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త టి.సుబ్బరామిరెడ్డి (టిఎస్సార్)కి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)లో స్థానం లభించింది. సిడబ్ల్యుసిలో శాశ్వత ఆహ్వానితునిగా టిఎస్సార్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఈనెల 23న ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్ర విభజనానంతరం తెలుగువారికి కాంగ్రెస్‌లో ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయింది. చాలా కాలం తర్వాత ఇప్పుడు టిఎస్సార్‌కు సిడబ్ల్యుసిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వడం ఎంతైనా విశేషం. రాజకీయ రంగంలో విశేష అనుభవం గడించిన టిఎస్సార్‌కు ఇంతటి గౌరవమైన స్థానం లభించడం పట్ల కాంగ్రెస్‌వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 1996-98 లోక్‌సభ ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి ఎన్నికైన టిఎస్ఆర్ కేంద్రంలో మంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టారు. 2006-08 మధ్య కాలంలో మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో కేంద్ర గనుల శాఖ సహాయమంత్రిగా కూడా ఉన్నారు. 2002లో రాజ్యసభకు ఎన్నికై మూడుసార్లు రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. ఎంపీగా సుమారు 24 ఏళ్ళ పాటు ఆయన గురుతరమైన బాధ్యతలు చేపట్టి అటు పార్టీకి, ఇటు ప్రజలకు అపారమైన సేవలు చేశారు. సినీరంగంతోనూ, కళారంగంతోనూ ఆయనకు ఎంతోకాలం నుంచి మంచి అనుబంధం ఉంది. ఎందరో సినీదిగ్గజాలను, కళాకారులను ఆహ్వానించి వారికి ఘనసన్మానాలు చేసిన ఘనత ఆయనది. అంతేకాదు ఆయన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కూడా. తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్‌గా కూడా టిఎస్సార్ ఎంతో భక్తిశ్రద్ధలతో పనిచేశారు. కాంగ్రెస్‌పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక కమిటీగా ఉన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో మన నెల్లూరీయుడైన సుబ్బరామన్నకు సముచిత స్థానం లభించడం ఎంతో సంతోషకరం.

# గుమ్మిడిపూండిలో దివ్యాంగులకు శిక్షణా కేంద్రం

## శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం



రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్(ఆర్‌సిఎం) మరియు వర్త్ ట్రస్ట్ సంస్థలు సంయుక్తంగా శ్రీసిటీ సమీపంలోని గుమ్మిడిపూండి ఆర్‌సిఎం బాయ్స్ టౌన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని ఈనెల 22న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. గుమ్మిడిపూండి ఆర్‌సిఎం అధ్యక్షుడు పీవీ మోహన్ రామన్, రోటరీ జిల్లా గవర్నర్ జె.శ్రీధర్, రంజిత్ ప్రతాప్, ప్రాజెక్టు ఛైర్మన్ రవి సుందరేశన్ పలువురు రోటరీ క్లబ్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులైన బాలురకు వివిధ వృత్తివిద్యా కోర్సులలో సర్టిఫికేట్ శిక్షణ అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టిన ఆర్‌సిఎం మరియు వర్త్ ట్రస్ట్ సంస్థలను ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. దివ్యాంగులకు ఈ శిక్షణా కేంద్రం అన్ని విధాలా ఎంతో ఉపయోగంగా ఉంటుందని, దీనికి తన పూర్తి సహకారం అందించడంతో పాటు, ఈ కేంద్రంలో కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన యువకులకు శ్రీసిటీలోని పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కూడా రవీంద్ర సన్నారెడ్డి హామీ ఇచ్చారు.

# జర్నలిస్టుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



## - ఐజెయు అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఏపియుడబ్ల్యుజె నాయకుల విమర్శ

రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ వైఖరి గర్హనీయమని ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 23న నెల్లూరులో ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. పలువురు ఐజెయు-ఏపియుడబ్ల్యుజె నాయకులు పాల్గొన్నారు. పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానం అసంబద్ధంగా ఉందని, గత ప్రభుత్వ హయాంలో 20వేల మందికిపైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇస్తే నేటి ప్రభుత్వం కేవలం 8వేల మందికే అక్రిడిటేషన్లు మంజూరుచేయడం దారుణమని జర్నలిస్టు సంఘాల నాయకులు శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు పేర్కొన్నారు. పత్రికా ప్రతినిధులు సభ్యులుగా ఉండాల్సిన అక్రిడిటేషన్ కమిటీలో అధికారులను సభ్యులుగా చేర్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందని, అర్హులైన పలువురికి అక్రిడిటేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. అక్రిడిటేషన్ అనేది కేవలం గుర్తింపు మాత్రమేనని, పనిచేసే జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి జారీచేసే అక్రిడిటేషన్లను నేటి ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనంతగా అస్తవ్యస్తం చేసిందని వారన్నారు. జర్నలిస్టులకు చిరకాలంగా ఉన్న సదుపాయాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా కుదించివేయడం, లేదా పూర్తిగా తొలగించడం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు తొలగిపోతాయని అందరం ఆశించామని, అయితే అందుకు భిన్నంగా అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చకపోవడం విచారకరమని వారు పేర్కొన్నారు. పొరుగునున్న తెలుగురాష్ట్రం తెలంగాణాలో జర్నలిస్టుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతుంటే, ఇక్కడి ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని వారు విమర్శించారు. జర్నలిస్టులకు భద్రత కరవైందన్నారు. జర్నలిస్టులకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుచేయడంలో, ఉత్తమ పాత్రికేయులకు పురస్కారాలు అందించడంలో, హెల్త్‌స్కీములు అమలుచేయడంలో గత ప్రభుత్వం ఎంతో సహకరించిందని, ఈ ప్రభుత్వం వచ్చాక అవన్నీ నామమాత్రమయ్యాయని, గత మూడేళ్ళగా హెల్త్ స్కీమ్‌ల పాలసీలు రెన్యువల్ కూడా జరగడం లేదని వారు ఆవేదనతో చెప్పారు. చివరికి జర్నలిస్టుల బీమా పథకం గడువు 2020 ఆగస్టుతో ముగిసినా నేటికీ దానిని పునరుద్ధరించలేదని, జర్నలిస్టులకు ఎంతో ముఖ్యమైన ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం పట్టీపట్టనట్లు ఉంటోందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో శ్రీనివాసరెడ్డితో పాటు ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, ఐజెయు నాయకులు అంబటి ఆంజనేయులు, ఆలపాటి సురేష్, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, ఏపియుడబ్ల్యుజె జిల్లా నాయకులు వి.వెంకటేశ్వర్లు, కె.దయాశంకర్, రమేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా మృతుల కుటుంబాలకు సాయం ఏదీ?...

కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన జర్నలిస్టులను ఫ్రంట్‌లైన్ వారియర్లుగా గుర్తిస్తూ, కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆర్థికసాయం అందచేశాయని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి సాయం ఏదీ అందలేదని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో 130 మంది దాకా పాత్రికేయులు కరోనాతో మరణించినా, వారి కుటుంబాలకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని తాము కోరితే కుటుంబానికి 5 లక్షల వంతున ఆర్థికసాయం చేస్తామని చెప్పారని, కానీ ఆ సాయం నేటికీ అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పత్రికారంగంలో సేవలందించిన జర్నలిస్టులకు పెన్షన్ ఇచ్చి ఆదుకుంటామని ముఖ్యమంత్రి గతంలో హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి దాకా ఆ విషయం పట్టించుకోకపోవడం బాధాకరమని వారన్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇకనైనా జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

లాయర్
జూన్ 24, 2022

ఇది ఎవరూ ఊహించని ఉత్పాతం. ఉన్నట్లుండి ఇంతటి నిరసనల సెగ వెల్లువెత్తుతుందని ఎవరూ అనుకోలేదు. సైన్యంలో నియామకాల కోసం, త్రివిధ దళాల్లో యువతను చేర్చుకునేందుకు కేంద్రప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ పథకంపై ఇలా హింసాత్మక సంఘటనలు జరుగుతాయని ఎవరూహించగలరు?..ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో పెల్లుబుకుతున్న ఆందోళనల సంగతి పక్కనపెడితే ప్రశాంతతకు మారుపేరైన తెలుగురాష్ట్రం తెలంగాణలో కూడా ఇలాంటి ఘటనలు జరుగుతాయని ఎవరనుకుంటారు?... ఎంతో ముఖ్యమైన సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌కు కూడా అగ్నిపథ్ తాలూకు మంటలంటుకోవడం దారుణం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇంతటి భయోత్పాతం ఇటీవలి కాలంలో కనీవినీ ఎరుగనిది. వేలాది మంది యువకులు ఒక్కసారిగా వచ్చిపడడం, సికిందరాబాద్ రైల్వేస్టేషన్‌లో విధ్వంసకాండకు పాల్పడడం, రైళ్ళకు నిప్పు పెట్టడం, పోలీసు కాల్పుల్లో ఒకరు మరణించడం, కొంతమంది గాయపడడం అంతా కొద్దిగంటల వ్యవధిలోనే జరిగిపోయింది. ప్రయాణీకులు బతుకుజీవుడా అంటూ పరుగులు తీయాల్సిన దుస్థితి. సైనికరంగంలో పనిచేయాలనుకున్నవారు ఉన్మాదుల్లా... ఉగ్రవాదుల్లా మరీ ఇంత బరితెగిస్తే ఎలా?...

## 'అగ్నిపథ్'లో.. మంటలా?



కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన 'అగ్నిపథ్' పథకాన్ని నిరసిస్తూ దేశంలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరగడం దురదృష్టకరం. సికిందరాబాద్ రైల్వేస్టేషన్‌లోనూ విధ్వంసకాండ ఘోరం. రక్షణరంగంలో పనిచేయాలనుకున్నవారు ఇలాంటి ఘటనలకు పాల్పడడం మరీ దారుణం. ఈ పథకం దేశ భవిష్యత్తుకు ఎంతో మంచిది. కేంద్రం ముందు చూపుతో తీసుకున్న నిర్ణయమిది. దీనిపై ఎలాంటి అపోహలు లేకుండా అన్నివర్గాలతో చర్చించి సానుకూల దృక్పథం కలిగేలా ప్రచారం కల్పించి అందరికీ ఆమోద యోగ్యమైన పథకంగా అమలుచేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంది.

ఇలాంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడడం ఘోరం. కారణం ఏదైనా, ప్రేరణ ఎవరిదైనా ఇది క్షమించరాని నేరం. మూకుమ్మడిగా వేలాదిమంది యువకులు ఒక్కసారిగా వచ్చి రైల్వేస్టేషన్‌లో హింసాకాండకు సిద్ధమవుతున్నారన్న సమాచారం తెలుసుకోలేని నిఘా వ్యవస్థలు ఈ అనుకోని విధ్వంసకాండను చూసి విస్తుపోవడం సహజమే. అయినా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుందీ?... ఈ పథకం దేశ భవిష్యత్తుకు ఎంతో మంచిదని విజ్ఞులంటున్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అందుకే కేంద్రం ఎంతో ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే అగ్నిపథ్ వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకునే సందర్భాల్లో కేంద్రం ఆచితూచి వ్యవహరించడమే కాక, అందరి అభిప్రాయాలను తీసుకుని సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తే ఇంకా బావుండేదంటున్నారు. మంచి ఆలోచనలున్నా వాటిని సాకారం చేసుకునేందుకు సమిష్టి నిర్ణయాలే సముచితమన్నది పెద్దల మాట. చేసేది మంచిపనే అయినప్పుడు, దానిని మంచిగా ఆచరణలోకి పెట్టినప్పుడే సార్థకత. దేశం కోసం ఏదైనా ఒక గొప్ప నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు దానిపై అందరినీ సంప్రదిస్తే తప్పేముందీ?.. అనే అభిప్రాయాలను కాదనలేం. ఒకప్పట్లో ఏకచత్రాధిపత్యంగా ఏలుతున్న కాంగ్రెస్ పార్టీని వెనక్కునెట్టి తొలి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి అగ్రనాయకుడు అటల్‌బిహారీ వాజ్‌పేయి కూడా ఏదైనా గొప్ప నిర్ణయం తీసుకునే సందర్భంలో సంకీర్ణభాగస్వాములైన పార్టీల వారందరితో అరమరికలు లేకుండా చర్చించేవారనే సంగతి తెలిసిందే కదా!... మంచి ఎప్పటికైనా మంచే. అగ్నిపథ్ ఎంతో మంచి పథకమని, భవిష్యత్తులో అది భారతదేశానికే మంచి మేలు చేకూరుస్తుందని నేతలు చెప్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ ఆ పథకం ఎంత మంచిదో కాస్త ముందుగానే అందరికీ వివరించి ఉంటే ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావుండేది కాదు. ఒకవేళ సైన్యంలోకి తీసుకున్నా కాలపరిమితి ప్రకారం నాలుగేళ్ళ తర్వాత 75శాతం మందిని తొలగిస్తే తమ జీవితాల పరిస్థితి ఏమిటన్నది ఉద్యోగార్థుల ఆందోళన కావచ్చు. అలాంటి ఆందోళనలేమీ లేకుండా వారి అపోహలు తొలగేలా.. వారి జీవితానికి ఎలాంటి భరోసా ఉంటుందో ముందుగానే వివరించి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. ప్రతి విషయాన్నీ రాజకీయంగా చూసేవారిని అసలు పట్టించుకోనక్కర లేదు. అయినా ఇదేమీ రాజకీయ అంశం కాదు. దేశ రక్షణ వ్యవస్థకు సంబంధించినది కనుక మరీ జాగ్రత్తగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం. పక్కలో బల్లెంలా పాక్, మరోవైపు చైనాలు కాచుకుని ఉన్న నేపథ్యంలో దేశ రక్షణకు ఇలాంటి పటిష్టమైన నిర్ణయాలు తప్పనిసరి. అయినప్పటికీ ఉద్యోగార్థుల అపోహలు, అసంతృప్తుల పట్ల కేంద్రం అన్ని వర్గాలతో మరోసారి చర్చించి అందరికీ ఆమోద యోగ్యంగా ఈ పథకాన్ని రూపుదిద్దితే బాగుంటుంది. నిర్ణయాలు మంచివే అయినప్పటికీ అందరి అభిప్రాయాలను తీసుకుని వాటిని ఆచరణలోకి తెస్తే మంచి ఫలితాలతో పాటు పాలకుల ప్రతిష్ట కూడా మరింతగా పెరుగుతుంది.

## మెయింటెనెన్స్ లేని మీడియన్లు



నెల్లూరు నగరంలో ప్రధాన రహదారులలో దారి మధ్యలో వచ్చే, వెళ్ళే వాహనాలను వేరు చేస్తూ డివైడర్లను నిర్మించారు. వీటిని మీడియన్లు అని కూడా అంటారు. కేవలం గోడలా నిర్మిస్తే డివైడర్. మధ్యలో మొక్కలు పెంచితే మీడియన్. నగరంలో అయ్యప్పగుడి నుండి ఉన్న ప్రధాన రహదారిలోనూ అలాగే మినీ బైపాస్‌లోనూ ఈ మీడియన్ తరహా నిర్మాణాలే మనకు ప్రధానంగా కనిపిస్తాయి. ఈ మీడియన్ నిర్వహణ పేరుతో నగర పాలక సంస్థ లక్షలు ఖర్చు చేస్తోంది. ఆ లక్షలు లెక్కలలో కనిపిస్తున్నాయే తప్ప పనులలో కాదు. నగరంలో అనేక కూడళ్ళలో ఉన్న ఐలాండ్‌లు, మీడియన్ల మెయింటినెన్స్ బాధ్యత నగర కార్పొరేషన్‌దే.

అయ్యప్పగుడి నుండి ట్రంకురోడ్డు వరకు వచ్చే మీడియన్‌లో మొక్కలకి

### సమస్యల తో 'రణం'

బదులుగా పెద్ద చెట్లు పెంచారు. ఇక అదే అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ వరకు వచ్చే మినీ బైపాస్‌లో మొక్కలు వేసినా వాటి ఆలనా పాలనా చూసే నాథుడే లేడు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పుణ్యమా అంటూ అన్నమయ్య సర్కిల్ నిత్యం పచ్చదనంతో కళకళలాడుతోంది. బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌ని సమీపంలో ఉన్న వస్త్ర దుకాణ యాజమాన్యం మెయింటైన్ చేస్తోంది. మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహ ప్రాంతంలో వారి కుటుంబసభ్యులే ఆలనా పాలనా చూస్తున్నారు. మిగిలిన ఐలాండ్‌లను పట్టించుకునే అధికారులు కానీ నేతలు గానీ లేనే లేరు. ప్రముఖుల ఐలాండ్లన్నీ మతపరమైన పోస్టర్లతో నిండిపోయి వికారంగా తయారయ్యాయి. పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛాంధ్రా, స్వచ్ఛభారత్ అంటూ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు పెట్టి ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వ సంస్థలు కనీసం నగర పరిశుభ్రత కూడా పాట్టించుకోకపోవడం దారుణం.

- సంచారి

## ఆదివాసీ మహిళకు అత్యున్నత అవకాశం

దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో, ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్మును భారతీయ జనతాపార్టీ ఎంపిక చేయడం ఎంతో సంతోషకరం. రాష్ట్రపతి అభ్యర్థిగా దాదాపు 20 పేర్లను పరిశీలించిన తర్వాత ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీబోర్డు సమావేశంలో ఆమె పేరును ఖరారు చేయడం ద్వారా బిజెపి ఆదివాసీ మహిళకు అత్యున్నత అవకాశం కలిగించినట్లయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా ఆదివాసీ వర్గాలకు రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అవకాశం కలగలేదు. ఆ అవకాశం ఇప్పుడు ఒక్క బిజెపిలోనే లభించడం హర్షదాయకం. రాష్ట్రపతి ఎన్నికల్లో నిలిచిన తొలి ఆదివాసీ అభ్యర్థి ఆమే. ఒరిస్సాకు చెందిన ద్రౌపది ముర్ము ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పనిచేసి, జార్ఖండ్ రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్‌గా పూర్తికాలం పనిచేసిన విశేష ప్రతిభాశాలి. రాజకీయాల్లోకి రాకముందు ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయరంగంలోకి వచ్చి శాసనసభ్యురాలిగా, మంత్రిగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారు. పేద, బడుగు బలహీనవర్గాల వారికి, అణగారిన వర్గాల ప్రజలకు ఆమె సేవలు నిరుపమానం. చిన్నస్థాయిలో రాజకీయ జీవితం ప్రారంభించి..సమున్నతమైన రాష్ట్రపతి అభ్యర్థిగా సాగుతున్న ఆమె జీవిత ప్రస్థానం..ఎంతో స్ఫూర్తిదాయకం.

ఎం.వెంకటేశ్వర్లు, ముత్తుకూరు.

## 'అగ్నిపథ్'పై అవగాహన లేకనే అనర్థాలు!




భారత ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం భారత సైన్యంలో ఉద్యోగ నియామకాలకు రూపొందించిన అద్భుతమైన పథకం 'అగ్నిపథ్'. ఇది చారిత్రాత్మకమైన నిర్ణయం. ఈ నియామక విధానాన్ని ఎవరి స్వార్థానికి వాళ్ళు వాడుకుంటూ కేంద్ర ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోయడమే కాకుండా తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలని తప్పుత్రోవ పట్టిస్తున్నారు. నిజానికి 'అగ్నిపథ్' వలన యువతకు నష్టం కన్నా లాభమే ఎక్కువ. పూర్తిగా అవగాహన చేసుకోకుండా చెప్పుడు మాటలు విని అనర్థాలకు పూనుకోవడం సరికాదు. ఇంటర్నెట్‌లో వందలకొద్దీ బ్లాగులలో 'అగ్నిపథ్' గురించిన సమాచారం స్పష్టంగా ఉంది. వాట్సఅప్ గ్రూపులలోని సందేశాల ద్వారా మూకుమ్మడిగా తరలివచ్చి విధ్వంసాలకు పూనుకోవడం హేయమైన చర్య. తమచేతిలో ఉన్న అదే సెల్‌ఫోన్ ద్వారా 'అగ్నిపథ్' గురించి పూర్తిగా తెలుసుకోవచ్చు. సైన్యంలో చేరి దేశ రక్షణకోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధమని చెప్తున్న యువతరం, ఇలా ప్రభుత్వ ఆస్తులని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలి.

ఎం.చంద్రమౌళి, న్యూఢిల్లీ.

## నెల్లూరు నగరంలో
## దుర్గంధం తొలిగేదెప్పుడు?

నెల్లూరు నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. నగర పాలక సంస్థ వారు, పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తకుప్పలు పరిశుభ్రం చేయాల్సి ఉన్నా, రోడ్లలో పరిశుభ్రతను పరిరక్షించాల్సి ఉన్నా, పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో నగరంలోని ప్రధానమైన కూడళ్ళు, రోడ్లు, సందు గొందులన్నీ గబ్బు కొట్టిపోతున్నాయి. సైడు కాలువల్లో చెత్తాచెదారం నిండిపోయి ఉంది. చిన్న వాన వచ్చినా, ఈ మురుగంతా రోడ్లమీదకు వస్తోంది. తద్వారా చుట్టుప్రక్కల ప్రజలకి దుర్గంధం, లేనిపోని వ్యాధులు తప్పడం లేదు. జిల్లా ఉన్నతాధికారులైనా ఈ దుస్థితులను పట్టించుకోవాలని ప్రార్థన.

జె.రామకృష్ణ, బాలాజీనగర్.

## మాస్కులు పెట్టుకోండి బాబూ!

కోవిడ్ తగ్గిపోయింది కదా అని అనుకోకండి. దేశంలో ఇంకా దాని విజృంభణ కొనసాగుతూనే ఉంది. తగ్గిపోయిందిలే అని మనం అనుకుంటున్నా 'తగ్గేదే లే' అంటూ కోరలు చాస్తోంది. కాబట్టి మాస్కులు పెట్టుకోండి బాబూ!..కరోనా రాకుండా ఇంజక్షన్లు వేసుకున్నాం కదా అని మాస్కులను నిర్లక్ష్యం చేస్తే లేనిపోని ప్రమాదం. ఊపిరితిత్తుల ద్వారా ప్రవేశించే కరోనా వైరస్ మన దరికి చేరకుండా మాస్కు ధరించడం ఎంతో ముఖ్యం. ఇప్పుడు ఎక్కడ చూసినా మాస్కులు లేకుండానే వస్తున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. భౌతిక దూరం పాటించడం, పరిశుభ్రంగా ఉండడం ఇప్పట్లో చాలా ముఖ్యం. వచ్చాక బాధలు పడేకంటే, కరోనా రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవడమే మంచిది.

కె.సుబ్బారావు, నెల్లూరు.

### పాఠకులకు మనవి..!

మన లాయర్ పత్రికలో ప్రచురితమవుతున్న అంశాలపై మీ అభిప్రాయాలను, సమాజ అభ్యుదయం కోసం ఉపకరించే మీ ఆలోచనలను మాతో క్లుప్తంగా పంచుకోండి. విషయ ప్రాధాన్యతను బట్టి వాటిని 'ప్రజావాణి'లో ప్రచురిస్తాం.

మీ భావాలను పంపవలసిన వాట్సాప్ నెంబర్: 98663 14741.

సం/-

## నోరు(దిగ) జారుతున్న 'రాజకీయం'

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం నోరు జారుతోంది. నేతలు తమ స్థాయిని, హోదాని మరచి ప్రవర్తిస్తున్నారు. ముఖ్యమంత్రులను, మాజీ ముఖ్యమంత్రులను సైతం తమ ఇష్టానుసారం బూతులు తిట్టే సంస్కృతికి ఇరు రాష్ట్రాల నేతలు తెరలేపారు. జుగుప్సాకరమైన భాషతో దిగజారి మాట్లాడుతున్నారు. రాజకీయం అంటేనే అసహ్యం కలిగేలా ప్రవర్తిస్తున్నారు. ప్రధాన మంత్రులను, జాతీయ స్థాయి నేతలను సన్నాసులు, దద్దమ్మలు అంటూ తెలంగాణలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తిట్ల పురాణం అందుకుంటే, ఆయన శిష్య పరిమాణం ఒకడుగు ముందుకేసి స్వరం కొంచెం పెంచి కొత్త తిట్లను కనుగొని మరీ ధ్వజమెత్తుతున్నారు. ఆంధ్రా రాజకీయాలలో బూతుల సంస్కృతికి తెలుగు తమ్ముళ్లు ముందుగా శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రిని ఒరే అని సంభోదిస్తూ, ఇంకా రాయడానికి వీలులేని భాషతో దూషిస్తున్నారు దేశం నేతలు. మీకంటే మేమేం తక్కువ తిన్నామా...? అన్నట్లుగా వైసీపీ నాయకులు వాళ్ళకంటే నాలుగు పదాలు ఎక్కువగానే చేర్చి ప్రతిదాడి చేస్తున్నారు. ముదనష్టపోడు, నికృష్టుడు, శనేశ్వరుడు అంటూ మాజీ ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తుతున్నారు. గౌరవప్రదమైన నడవడికతో, హుందాతనంగా రాజకీయాలు నెరపిన పాతతరం నాయకులను చూసిన కళ్ళతో, ఈ బూతునేతలను చూస్తుంటే రాజకీయాలంటేనే అసహ్యం కలుగుతోంది.

- కె.వి.నాగేశ్వరరావు, విజయవాడ.

# జిల్లాస్థాయి ప్లీనరీ పరిశీలకునిగా.. బల్లి కల్యాణ్

## రాజ్యసభ సభ్యులు, వైకాపా జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు జిల్లాలో వైఎస్సార్సీపి జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశాన్ని పర్యవేక్షించేందుకు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నియామకం జరిపినట్లు ఈనెల 22న రాజ్యసభ సభ్యులు, వైకాపా జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. అదేవిధంగా కావలి అసెంబ్లీ నియోజకవర్గ ప్లీనరీ పరిశీలకులుగా నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆత్మకూరు నియోజకవర్గానికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కోవూరు నియోజకవర్గానికి ఏపిఎస్‌పిహెచ్‌సి ఛైర్మెన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, నెల్లూరు నియోజకవర్గానికి ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరి అనిల్‌బాబు, నెల్లూరు రూరల్‌కు తాటి వెంకటేశ్వరరావు, సర్వేపల్లికి మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఉదయగిరికి విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కందుకూరు నియోజకవర్గానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి సి.సుధీర్‌రెడ్డిలను నియమించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ఈనెల 30వతేదీన నెల్లూరు-గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరుజిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహణ గురించి వారు చర్చించుకున్నారు.

# ఒక్క ఛాన్స్ పేరుతో.. జనాన్ని బాదేస్తున్న జగన్

## టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ



ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పన్నుల పేరుతో జనాన్ని బాదేస్తున్నాడంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన ముత్తుకూరు మండలంలోని మల్లూరు గ్రామంలో 'బాదుడే బాదుడు' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు జగన్ పాలన తీరును వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని, వైకాపా పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ప్రజలు చైతన్యవంతులై టిడిపి అధినేత చంద్రబాబునాయుడును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు గ్రామస్తులకు కరపత్రాలు పంచిపెట్టారు.

# నేత్రపర్వంగా..వెంగమాంబాదేవి బ్రహ్మోత్సవాలు



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో కొలువైవున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. కోరిన కోర్కెలు నెరవేర్చే చల్లనితల్లిగా పేరొందిన వెంగమాంబాదేవి అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాదిగా ఈ ఉత్సవాలకు వస్తున్నారు. ఆలయంలో కొలువైవున్న వెంగమాంబాదేవి-గురవయ్య దంపతులను భక్తులందరూ దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న గ్రామోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. వెంగమాంబ దంపతుల ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఈనెల 23వ తేది ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమ ఉత్సవం, ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం అంగరంగవైభవంగా జరిగాయి. ఇసకేస్తే రాలనంతగా భక్తజనం తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఇఓ ఆర్.వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. కావలి ఇన్‌చార్జి డిఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 14 మంది ఎస్‌ఐలు, 340 మంది పోలీసులు బ్రహ్మోత్సవాల్లో బందోబస్తు విధులను నిర్వహిస్తున్నారు.

# నిస్వార్ధ సేవలే..'వనం ఫౌండేషన్' లక్ష్యం



నిరుపేదలు, దీనులు, అసహాయులను ఆదరించి వారికి తనవంతు సేవ చేయడమే వనం ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, రమాదేవి చెప్పారు. ఆ సంస్థ 6వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా ఈనెల 18న నెల్లూరులోని పొదలకూరురోడ్ వాటర్‌ట్యాంక్ సెంటర్‌లో ఉన్న జిల్లా ప్రాంతీయ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎంతోమంది అనాధలు, పేదలకు తమవంతు చేయూతను అందిస్తున్నామని, పర్యావరణాన్ని కాపాడేందుకు వేలాది మొక్కలు నాటామని వారు చెప్పారు. ప్రభుత్వ సాయంతో పాటు దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డాక్టర్ బాలచెన్నయ్య, ఫౌండేషన్ కమిటీ సభ్యులు టివిఆర్, గిరీష్, సాయిలత, ప్రవీణ్, సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, షేక్ అల్లాభక్షు, చిన్నా, నూర్, స్మారిక తదితరులు పాల్గొన్నారు.


శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి



పదకవితా పితామహులు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి
613వ జయంతి సందర్భంగా
'వాచస్పతి' బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి
ఆధ్యాత్మిక ప్రవచనము.

తేది: 26.06.2022, ఆదివారం

సా॥ 4.15 గంటలకు
మినీబైపాస్,
అన్నమయ్య సర్కిల్‌లోని
అన్నమయ్య విగ్రహం వద్ద
పూజా కార్యక్రమము మరియు
అన్నమయ్య సంకీర్తనాలాపన.

సా॥ 5.00 గంటల నుండి
మినీబైపాస్‌లోని
పి.వి.ఆర్ కళ్యాణ మండపము నందు
జయంతి వేడుకలు మరియు
శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి
ఆధ్యాత్మిక ప్రవచనము.

ఆధ్యాత్మిక, సంగీత, సాహిత్య, సాంస్కృతిక ఆరాధకులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

భక్తులెల్లరు పై కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించవలసిందిగా మనవి.

గమనిక : ★ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు
ఖచ్చితంగా సంప్రదాయ దుస్తులు ధరించి రావలెను.
★ సా॥ 4.30గం.ల కల్లా తమ సీట్లలో ఆశీనులు కావలెను.

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి

:: కార్యవర్గం ::

గౌరవాధ్యక్షులు:
కె.వి.రత్నం
ఛైర్మెన్, రత్నం విద్యాసంస్థలు

అధ్యక్షులు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
రాజ్యసభ సభ్యులు

ఉపాధ్యక్షులు:
వీరిశెట్టి హజరత్‌బాబు
మురళీకృష్ణ70

ముఖ్యసమన్వయకర్త:
తుంగా శివప్రభాత్‌రెడ్డి
సంగ్రాహకులు, 'లాయర్' పత్రిక

:: కార్యనిర్వాహక సభ్యులు ::

వాకాటి విజయకుమార్‌రెడ్డి
యల్లం హనుమారెడ్డి
పి.విష్ణువర్ధన్‌రెడ్డి
సిహెచ్. పెంచలరెడ్డి
సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి
తామా మోహన్‌రాజ్
బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి
బట్రెడ్డి వెంకటకృష్ణారెడ్డి
గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి
కె.రవీంద్రరెడ్డి
యం.వి.సుబ్బారెడ్డి
కళాంజలి అనంత్
పి.చంద్రశేఖర్‌రెడ్డి
వట్టిగుంట చంద్రయ్యచౌదరి
యన్.వి.సురేష్
యన్.బలరామయ్యనాయుడు
ముడి శోభన్‌కుమార్‌రెడ్డి
కె.విజయకుమార్
దండమూడి హేమంత్‌కుమార్
యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్
వీరిశెట్టి సుధాకర్

### పేద బ్రాహ్మణ విద్యార్థులకు..

# 3.5 లక్షల ఆర్థికసాయం

**- డా. అజయ్ ఆధ్వర్యంలో చేయూత**



పేద బ్రాహ్మణ విద్యార్థులకు చేయూతగా ఉండేందుకు నెల్లూరులోని డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తన పేరుతో ట్రస్టును ఏర్పాటుచేసి, వారికి తమవంతు సేవలందిస్తున్నారు. ఈనెల 19న నెల్లూరులో తాము నెలకొల్పిన 'పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్టు' ద్వారా పేద బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందజేశారు. డా. అజయ్ ఆధ్వర్యంలో నగరంలోని టివిఎస్ కల్యాణ్‌సదన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ, బీటెక్,పీజీ, ఎంబిబిఎస్ చదువుకుంటున్న మొత్తం 105 మంది విద్యార్థులకు 3.51 లక్షల రూపాయల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.పి బాలాజీ మాట్లాడుతూ చదువుతోనే సంస్కారం లభిస్తుందని, తద్వారా విద్యార్థులు మంచి వ్యక్తిత్వంతో రాణించి సమాజ వికాసానికి తోడ్పడాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కెపి సాయిరాం, బ్రాహ్మణ సేవాసంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడ్లదొన వాసుదేవరావు, ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వివిఎల్ వరప్రసాదరావు, వై.నాగదేవిప్రసాద్, ఉపాధ్యక్షులు ఎంవి చలం, కోశాధికారి బి.వెంకటసతీష్, సభ్యులు పివికెఆర్ సుబ్బుశర్మ, మాచవోలు భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్‌లో.. కృష్ణచైతన్య ఫస్ట్



ఇటీవల విక్రమసింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అన్ని కోర్సులు, గ్రూపుల్లో యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించారు. బిఎస్సీలో టి.లావణ్య 99.7 శాతం మార్కులు సాధించి అందరి అభినందనలు అందుకుంది. అదేవిధంగా ఎస్.స్వప్న 98.9, సిహెచ్ వాసవి 98.8, వి.దేవి, డి.హిమజ్యోతి, ఎస్.సూర్యకిరణ్‌లు 98.6, కె.వనజ, బి.సాత్వికలు 98.5శాతం మార్కులతో ఉత్తమశ్రేణి సాధించారు. బిఎస్సీ లైఫ్‌సైన్స్‌లో కె.జ్ఞానదీపిక 99.3, బి.వర్ష 98.1, డివి సాయిమనోజ 97.5 శాతం మార్కులతో, బిసిఏలో ఏ.శ్రీలహరి 99.8, డివి నాగరాణి 99.3, జి.తేజస్విని, సిహెచ్ అలేఖ్య, ఎస్.ధరణీలక్ష్మి 99.1, కె.ప్రవీణ్‌కుమార్ 99 శాతం మార్కులతోనూ ఉత్తమంగా నిలిచారు. బిబిఏలో ఎం.రమ్యశ్రీ 97, ఏ.చందనప్రియ 95.3, ఎస్.పావని 95.1, బికాంలో ఆర్ అరుణ 96.5, ఎస్‌కె నాజీరాపర్వీన్ 95.8, ఎస్.గోమతి 94.7, సిహెచ్ యశ్వంత్ 99.2 శాతం మార్కులతో రాణించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ మొత్తం 252 మంది విద్యార్థులు 95 శాతం పైగా మార్కులు సాధించారని, 676 మంది విద్యార్థులకు 90 శాతం పైగా మార్కులు వచ్చాయని, 1348 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో 75 శాతంపైగా మార్కులు తెచ్చుకుని యూనివర్శిటీ స్థాయిలో కృష్ణచైతన్య విద్యార్థులు అగ్రస్థానంలో నిలవడం తమకెంతో సంతోషంగా ఉందంటూ, ఆ విద్యార్థులందరినీ అభినందించారు. కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ ఎస్.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నగర బీసీ సెల్‌కు.. కొత్త కమిటీ

తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర బీసీ సెల్‌కు కొత్త కమిటీ నియామకం జరిగింది. నగర టిడిపి అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల ఆ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా తుళ్ళూరు బాబుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరాల విజయవర్ధన్, ఉపాధ్యక్షులుగా కయ్యాల గోపి, ఎం.చంద్రమౌళి, అనంత సాగరం భరత్ నియమితులయ్యారని పేర్కొన్నారు.

అదేవిధంగా అధికార ప్రతినిధులుగా ముంగమూరు విజయ్ కుమార్, దగ్గుపాటి మాల్యాద్రిలను, ఇతర కార్యవర్గ ప్రతినిధులను నియమించారని ఆయన తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## యోగాను ఆచరిస్తే మంచి ఫలితాలు

**విఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి**




యోగాను క్రమం తప్పకుండా ఆచరిస్తే మంచి ఫలితాలుంటాయని, ఆరోగ్యానికి యోగా ఎంతో మంచిదని విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి అన్నారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 21న జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మనదేశంలోని యోగ-ఆయుర్వేదం అనే రెండు ముఖ్యమైన అంశాలు ఎంతో ప్రాముఖ్యమైనవని, ఇప్పుడు ప్రపంచం మొత్తం యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులలో మన సంప్రదాయ పద్ధతులైన యోగాను అందరూ పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విశ్వవిద్యాలయం యోగా మీద ఒక ప్రత్యేకమైన 3నెలల సర్టిఫికేట్ కోర్స్‌ను ప్రారంభించామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విఎస్‌యు రిజిస్ట్రార్ డా. యల్ విజయకృష్ణారెడ్డి తెలిపారు.అనంతరం స్థానిక సర్టిఫైడ్ యోగ ప్రాక్టీషనర్ జి. నరేష్ కుమార్ వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించి యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. విఎస్‌యు ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ్ ఆనందకుమార్‌బాబు, సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అల్లం, ప్రోగ్రాం అధికారి డా. వై.విజయ, డా. ఆర్ ప్రభాకర్, పిఆర్‌ఓ డా. కోట నీల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటివద్దకే మెడికవర్ వైద్యసేవలు

**- బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి కాకాణి**



అత్యాధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులచే రోగులకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తూ పలు అవార్డులు అందుకున్న నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి తాజాగా మరో వైద్యసేవను ప్రారంభించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన నివాసంలో మెడికవర్ ఆసుపత్రి బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ, ప్రజల కోసం అన్ని రకాల ఆరోగ్యసేవలను ఇంటివద్దకే అందించేందుకు మెడికవర్ సిద్ధమైందని, ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని అన్నారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ, డైటీషియన్ సేవలతో పాటు నర్సింగ్, శ్యాంపిల్ కలెక్షన్ వంటివన్నీ ఇప్పుడు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 040-68334455 నంబర్‌కు ఫోన్ చేస్తే మెడికవర్ ఆసుపత్రి వైద్యసేవలు ఇంటివద్దకే వస్తాయన్నారు. అంతేకాకుండా 500 రూపాయలకు మించి కొనుగోలు చేసే మందులను కూడా ఉచితంగా డోర్‌డెలివరీ ద్వారా అందజేస్తామని, ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఆసుపత్రి రీజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఉదయభాస్కర్, మధుసూదన్, పిఆర్‌ఓ చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కవయిత్రికి.. ఉత్తర టెక్సాస్‌లో సన్మానం



ఉత్తర టెక్సాస్‌లో తెలుగు సంఘం వారు జూన్ 19న 'నెల నెలా.. తెలుగు వెన్నెల' తెలుగు సాహిత్య వేదిక తరఫున నిర్వహించిన 179వ సాహిత్య సదస్సులో నెల్లూరు కవయిత్రి డా.పాతూరి అన్నపూర్ణ పాల్గొని సన్మానం అందుకున్నారు. 'సాహిత్యం -సామాజిక స్పృహ' అనే అంశంపై అంతర్జాలంలో సాహితీవేత్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం తీరుతెన్నులను ఆమె వివరించారు. అనంతరం నిర్వాహకురాలు అరుణజ్యోతి ఆమెకు సన్మాన పత్రాన్ని బహుకరించారు. వైదేహి శశిధర్, యుకె నుండి శ్రీమతి అరవింద, మేరీలాండ్ నుండి కాశీనాధుని రాధ తదితర సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు ఉమామహేష్ పార్నపల్లి సమన్వయకర్తగా వ్యవహరించారు.



## కలెక్టర్ రక్తదానం

జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఇటీవల రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసి రక్తదాతలకు మరింత స్ఫూర్తిని కలిగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమన్నారు. రక్తదానం చేస్తే బాధితులకు ప్రాణదానం చేసినట్లేనన్నారు. కోవిడ్ విజృంభిస్తున్న తరుణంలో రెడ్‌క్రాస్ రోగులకు అందించిన సేవలు అపారమన్నారు. నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ సేవలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి రోగులకు తమవంతు సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సుధీర్‌నాయుడు, సురేష్, జి.ప్రసాద్, రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మణిపాల్‌లో శ్వేతాకృష్ణ యోగా ప్రదర్శన



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న మణిపాల్ యూనివర్సిటీలో జరిగిన యోగా కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కుమారి డిటి శ్వేతాకృష్ణ యోగా ప్రదర్శనను అత్యద్భుతంగా నిర్వహించి ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. మణిపాల్ యూనివర్సిటీ హెచ్‌ఓడి డాక్టర్ కె అన్నపూర్ణ, డాక్టర్ లావణ్యశెట్టి శ్వేతకృష్ణను అభినందించారు.

## చెస్ విజేత.. పృథ్వీరెడ్డి



జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని ఓ పాఠశాలలో జరిగిన చెస్ పోటీల్లో పృథ్వీరెడ్డి విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో పృథ్వీరెడ్డి, సుమన్‌లు ప్రథమస్థానం సాధించగా, సురేందిర, సతీష్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులందజేశారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, టోర్నీ నిర్వాహకులు పృథ్వీరెడ్డి, ఏ.వెంకటరమణ, ప్రదీప్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

## యోగా గురువుకు సత్కారం



గత పదిహేనేళ్ళుగా యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తూ 2017-18-19, 2022 సంవత్సరాల్లో నెల్లూరులో ప్రభుత్వం నిర్వహించిన యోగ దినోత్సవ కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామిగా ఉన్న ప్రముఖ యోగా గురువు ఎం.వెంకటరెడ్డిని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న కలెక్టర్ చక్రధర్‌బాబు సన్మానించారు.

## మూలస్థానేశ్వరుని హుండీ రాబడి.. 5.90 లక్షలు

నెల్లూరులోని మూలాపేటలో వెలసివున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల హుండీలు లెక్కించారు. గత మార్చి 10 నుంచి జూన్ 18వ తేదీ వరకు భక్తులు వేసిన కానుకలు లెక్కించగా 5,90,264 రూపాయలు రాబడి వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఆర్‌కె చైతన్య తెలిపారు. ఆలయ ఇఓ వేణుగోపాల్, ధర్మకర్తలు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైకాపా ప్లీనరీ సమావేశాల

# పరిశీలకులుగా.. ఆనం దంపతులు



తిరుపతి, ఆత్మకూరుల్లో జరిగే వైకాపా ప్లీనరీ సమావేశాల పరిశీలకులుగా నెల్లూరు డిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మెన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి, నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నియమితు లయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆ నియామకాలు జరిగాయి. తిరుపతి జిల్లా ప్లీనరీ సమావేశాల పరిశీలకులుగా విజయకుమార్‌రెడ్డి, ఆత్మకూరు ప్లీనరీ సమావేశాల పరిశీలకులుగా ఆనం అరుణమ్మలు ఆ బాధ్యతలను స్వీకరించారు. సిఎం ఆదేశం మేరకు ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీని బలోపేతం చేసే దిశగా కృషిచేస్తామని, ప్లీనరీ సమావేశాలను విజయవంతంగా నిర్వహిస్తామని ఆనం దంపతులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# మానవాళికి భారతావని అందించిన వరం.. యోగా

### శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



యోగా ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమూల్య వరమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ఆయన తన సందేశంలో, యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చ న్నారు. దైనందిక జీవితంలో యోగాను ఒక భాగం చేసుకొని, తద్వారా మంచి ఆరోగ్యం, చక్కని మానవ సంబంధాలు, మంచి ఆలోచనలను పెంపొందించుకోవాలని ఆయన శ్రీసిటీ ప్రాంతవాసులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శ్రీసిటీలో ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీ విజిటర్స్ సెంటర్ ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో సుమారు 130 మంది పాల్గొన్నారు. శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని కాపాడుకోవడానికి యోగా చాలా అవసరమని సూచించారు. నెల్లూరులోని ప్రణవ వెల్నెస్ సెంటర్‌కు చెందిన యోగా గురువు వి.చంద్రశేఖర్, ఆయన శిష్యుడు భార్గవకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా వలన కలిగే పలు ప్రయోజనాలను వివరించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్, శ్రీసిటీ సెజ్ కార్యాలయ స్పెసిఫైడ్ ఆఫీసర్ మధుబాబు, ఆథరైజ్డ్ ఆఫీసర్ రామారావు, రోటోలాక్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న, పలు పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, శ్రీసిటీ పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

### వెటరన్ క్రీడల్లో

# సత్తాచాటిన నెల్లూరోళ్ళు

గుజరాత్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వెటరన్ క్రీడల పోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. వయసు మీదపడినా క్రీడల్లో ప్రతిభతో రాణించి పలువురు పతకాలు గెలుచుకున్నారు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.కోటేశ్వరమ్మ 70 ప్లస్ విభాగంలో డిస్కస్‌త్రోలో బంగారుపతకం సాధించారు. అదేవిధంగా కావలికి చెందిన రైతు గద్దె వెంకటేశ్వర్లు 55 ప్లస్ విభాగంలో 200, 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్యపతకం కైవసం చేసుకు న్నారు. విశ్వోదయ బాలికోన్నత పాఠశా లకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.రాజ్యలక్ష్మి 55ప్లస్ విభాగంలో డిస్కస్ త్రోలో కాంస్యపతకం, నెల్లూరు ధనలక్ష్మీ పురానికి చెందిన కె.సునీతకు 400 మీటర్ల పరుగుపందెంలో రజతపతకం లభించాయి.

# 26న పెరసం కవిసమ్మేళనం

పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది ఉదయం 9.30 గంటలకు కవిసమ్మేళనం నిర్వహి స్తున్నామని, కవులు ఏదైనా సామాజిక అంశం మీద తమ కవితలు పఠించవ చ్చని, పాల్గొనే కవులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని నిర్వాహకులు మోపూరు పెంచలనరసింహం తెలియజేశారు. ఈ సందర్భంగా పెండ్యాల గాయత్రికి హెలెన్ కెల్లర్ అవార్డును ప్రదానం చేయనున్నామని, కవులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



# ఎమ్మెల్యే ప్రసన్నను కలసిన నాయకులు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఇటీవల నెల్లూరులోని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి విచ్చేసి వారిని మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆప్కోఫ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వవ్వేరు కో-పరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, ఇందుకూరుపేట కో-పరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వివిఎస్‌యు కొత్త రిజిస్ట్రార్‌గా డా.రామచంద్రారెడ్డి

### ➢ మాతృసంస్థకు ఎల్ విజయకృష్ణారెడ్డి



డా. రామచంద్రారెడ్డి



డా.ఎల్ విజయకృష్ణారెడ్డి

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా యోగి వేమన విశ్వవిద్యాలయంలో అసోసి యేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు విశ్వవిద్యాలయం ఉపకుల పతి ఆచార్య జిఎం సుందరవల్లి ఈనెల 20న ఉత్తర్వులిచ్చారు. ఇప్పటిదాకా వివిఎస్‌యు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న డా.ఎల్ విజయకృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని డా.బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా మాతృసంస్థలో విధులు నిర్వహించనున్నారు. 2020 మార్చి 18న విజయ కృష్ణారెడ్డి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వివిఎస్‌యు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండోసారి మరో ఏడాది, మూడోసారి రెండున్నర నెలపాటు పనిచేశారు. వివిఎస్‌యుకు వచ్చాక విజయకృష్ణారెడ్డి అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహించి అటు విద్యాభి వృద్ధికి, ఇటు విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేసి మంచి అధికారిగా గుర్తింపును తెచ్చుకున్నారు. ఈనెల 30వ తేదితో వివిఎస్‌యులో బాధ్యతల గడువు తీరనుండడంతో ఆయన తిరిగి మాతృసంస్థకు వెళ్ళనున్నారు.

# 'ఫ్లెమింగో' బహుభాషా కవితోత్సవం

అంతర్జాతీయ సంస్థ పెన్ ఇండియా నెల్లూరులోని స్థానిక దొడ్ల కౌశలమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 8వ ఫ్లెమింగో బహుభాషా కవితోత్సవం ఇటీవల జూమ్ వేదికగా జరిగింది. 2015లో మొదలైన ఈ కవితోత్సవం క్రమం తప్పకుండా జరుగుతూ వలసపక్షులు అనే అంశంపై ప్రతియేటా వివిధ భాషల్లో కవితలు గానం చేయించి నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం గురించి ప్రపంచానికి తెలియచెప్పడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని వ్యవస్థాపకులు డా. పెరుగు రామకృష్ణ చెప్పారు. ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం మరియు ట్రావెల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అద్యాషా దాస్ ముఖ్య అతిథిగా హాజరై కీలక ఉపన్యాసం చేశారని, డికె మహిళా కళాశాల సహాచార్యులు డా. కరుణశ్రీ కవులను పరిచయం చేశారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలనుండి 10 మంది ప్రసిద్ధ ఆహ్వానిత కవులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.






# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### - జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు



శారీరకంగా, మానసికంగా మనిషిని దృఢంగా తయారుచేసి తనసుతాను అత్యుత్త మంగా తీర్చిదిద్దుకునే అతి గొప్ప భారతీయ పురాతన సాధనం యోగా అని, యోగాను మన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చుని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అన్నారు. 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు, ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొ న్నారు. ఏడేళ్ళ క్రితం ఐక్యరాజ్యసమితి ద్వారా గుర్తింపు పొంది, నేడు ప్రపంచ వ్యాప్తంగా 175 దేశాల్లో యోగా దినోత్స వాన్ని పాటించడం గొప్ప విషయమని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా లక్షల మంది ప్రజలు యోగాను ఆచరిస్తున్నారన్నారు. దాదాపు వేయి మందికి పైగా విద్యార్థులు, యోగా సాధ కులతో పెద్దఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయుష్, సెట్నల్ అధికారు లను జిల్లా కలెక్టర్ అభినందించారు. తొలుత జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు, ఔత్సాహికులు యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో యోగాసనాలు సాధన చేశారు. అనంతరం యోగా గురువులను, కార్యక్రమ నిర్వాహకులను, సహాయ సహకా రాలు అందించిన సంస్థలను జ్ఞాపికలతో కలెక్టర్ సత్కరించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.జాహ్నవి, జిల్లా అటవీశాఖ అధికారి కె.వి.షణ్ముఖకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎం.గోవిందయ్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి మహేందర్ రెడ్డి, సెట్నల్ అధికారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కెఎస్‌ఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో..




ఈనెల 21వ తేదిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన అల్లూరులో కందల శివరామిరెడ్డి (కెఎస్‌ఆర్) ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి యోగా ప్రాధాన్యతను అందరికీ వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా మాస్టర్ యన్.మల్లి కార్జునరావును యోగ సాధకులు ఘనంగా సత్కరించారు. రామకృష్ణ జూనియర్ కాలేజీ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు. ఆర్యవైశ్య ప్రముఖులు డి.బ్రహ్మానందం, ప్రముఖ వైద్యులు డి.విజయకుమార్ తదితర యోగా సాధకులు పాల్గొన్నారు.





# కళ్యాణ వైభవం...!

## చరణ్ - రమ్య




గూడూరు నెల్‌క్యాస్ట్ సీనియర్ మేనేజర్, 'లాయర్' పత్రిక గూడూరు డివిజన్ ఇన్‌ఛార్జి, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ - రాజేశ్వరీదేవిల కనిష్ఠ పుత్రుడు **చరణ్ పురుషోత్తమ్ కుమార్ - సాయి రమ్య** (కోనసీమ జిల్లా, రావులపాలెం వాస్తవ్యులు దేవరబొట్ల నగేష్-సావిత్రిల కుమార్తె)ల వివాహం జూన్ 16న రావులపాలెంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

## అజ్జమ్ - షాజియా




గూడూరు ఏఆర్‌డి డైరెక్టర్, రియాజ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్ & హైరర్స్ సారధి షేక్ రియాజ్ భాయ్‌కు స్వయాన తమ్ముడు షేక్ బషీర్ - షబానాల కుమారుడు **షేక్ ఇమామ్ అజ్జమ్ - షేక్ షాజియా సుల్తాన**ల నిఖా జూన్ 19వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు అనేకమంది నగర ప్రముఖులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబులు హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

## శంకర్ - అఖిల



బ్రహ్మదేవం వాస్తవ్యులు క్రొత్తపల్లి రమేష్ కుమార్ - సులోచనల కుమారుడు **జయ్ శంకర్ కృష్ణ - నాగ అఖిల** ల పరిణయం జూన్ 15న హైదరాబాదులో జరిగింది. ఈ వేడుకకు పలువురు తెలంగాణ రాజకీయ నాయకులతో పాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## దివ్య - త్రినాథ్



ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఆయన సోదరుడు శ్రీరామ్ రమేష్‌కుమార్‌ల మేనకోడలు **హేమదివ్య - త్రినాథ్ సాయి వెంకటేశ్వరరావు**ల పెళ్లి జూన్ 19వ తేదీన నెల్లూరులో వేడుకగా జరిగింది. పలువురు నగర ప్రముఖులు, వైద్యులు పాల్గొని కొత్త జంటను దీవించారు. నవ వధూవరులకు 'లాయర్' శుభ దీవెనెలు.

# ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి శిక్షణా శిబిరం



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 20 నుంచి 29వ తేది వరకు 10-ఏ నౌకాదళ యూనిట్ ఎన్‌సిసి-నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరం(1) నిర్వహిస్తున్నామని ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది క్యాడెట్లు పాల్గొంటారని, క్యాంప్ కమాండెంట్‌గా కమాండింగ్ ఆఫీసర్ వినయరామచంద్రన్ వ్యవహరిస్తారని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్, ఎన్‌సిసి నావికా విభాగం అధికారి డా.వి.మల్లికార్జునరెడ్డి చెప్పారు. విద్యార్థులకు వెపన్ ట్రైనింగ్, డ్రిల్, నావిగేషన్, నావెల్ ఓరియంటేషన్, పర్సనాలిటీ డెవలప్‌మెట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, నేషనల్ ఇంటిగ్రేషన్, ఆంకర్ వర్క్, షిప్ మోడలింగ్, బోట్‌వర్క్, ఫైరింగ్, అబ్స్టాకిల్ ట్రైనింగ్, కమ్యూనికేషన్, అడ్వంచర్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారన్నారు. 10 రోజుల పాటు 10-ఏ నౌకాదళ యూనిట్, 2(ఏ)ఇఎంఇ యూనిట్‌లు కలసి ఈ శిబిరం నిర్వహిస్తున్నాయన్నారు. ఆర్మీ విభాగం అధికారి లెఫ్టినెంట్ జి.మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం



జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులు యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగాక్లబ్ ఆధ్వర్యంలో యోగాసనాలు సాధన చేశారు. సిబిసి డైరెక్టర్ తారకప్రసాద్, సమాజసేవకులు మాలకొండారెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డిలు పాల్గొని యోగా విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో ఎనిమిదేళ్ళ క్రితం మన భారతీయ యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి లభించడం ఎంతో విశేషమని కొనియాడారు. క్రమశిక్షణతో విద్యార్థులు యోగాసనాలు సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. యోగాలో ఉత్తమ ప్రదర్శనలతో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ కుమారి అహల్య, యోగా క్లబ్ ఇన్‌చార్జి డా.వి. మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### - మయూరి శ్యామ్ యాదవ్



ఈ నెల 26వ తేదీ ఆదివారం నెల్లూరు నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలోని ఎంసిఎస్ కల్యాణ మండపంలో 10వ తరగతి నందు 500పైన మార్కులు సాధించిన యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ సలహాదారుడు డాక్టర్ బి.శ్యామసుందరరావు(మయూరి శ్యామ్‌యాదవ్) ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు డివిజన్, నాయుడుపేట డివిజన్, సూళ్లూరుపేట డివిజన్ మరియు వెంకటగిరి డివిజన్‌లలో కూడా ఈ పురస్కారాలు అందిస్తునట్లు ఆయన పేర్కొన్నారు. పై కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్, మాజీ శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రయాదవ్, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ క్రిష్ణయ్యయాదవ్, వంకి పెంచలయ్యయాదవ్, ఆల్ఫా సుధాకర్ యాదవ్, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరు చేబోయిన వెంకట పైడేశ్వర్‌రావు యాదవ్, ఇతర యాదవ ప్రముఖులు విచ్చేసి యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలందిస్తారని శ్యామ్ యాదవ్ తెలిపారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న గూడూరు కోర్టు ప్రాంగణంలో ప్రముఖ యోగా ట్రైనర్ రాజా ఆధ్వర్యంలో యోగాసనాలు వేసిన సీనియర్ సివిల్ జడ్జి షేక్ జిలానీ భాషా, న్యాయవాదులు, యస్ఐలు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు.

## వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గూడూరు పట్టణంలోని రాజావీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు స్వామి అమ్మవార్లకు విశేష అలంకరణ నిర్వహించి లక్ష తులసి పూజ, కుంకుమ పూజ ఘనంగా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## తిలక్ నగర్‌లో నీటి కష్టాలు

గూడూరు రెండవ పట్టణంలోని తిలక్‌నగర్‌లో గత కొన్ని రోజులుగా మున్సిపల్ వాటర్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. నీటిని సరఫరా చేసే మోటారు రిపేరై రోజులు గడుస్తున్నా.. ఆ మోటారు దుస్థితిని పట్టించుకునే అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కానీ లేరని తిలక్‌నగర్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య వెంటనే పరిష్కరించకుంటే బిందెలతో మున్సిపాలిటీ ముట్టడికి సైతం వెనకాడమని స్థానికులు తెలియజేస్తున్నారు.

# మిగిలిన ధాన్యం కూడా కొనండి

## --- కలెక్టర్‌కు రైతు సంఘం నాయకుల వినతి ---



ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచి జిల్లాలో రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతుధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు చిరసాని కోటిరెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంకా ప్రొక్యూర్‌మెంట్ కాని ధాన్యం సుమారు 50వేల మెట్రిక్ టన్నుల దాకా ఉందని ఆయన పేర్కొన్నారు. జలదంకి మండలంలోని బ్రాహ్మణక్రాక, మరికొన్ని గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు కాక రైసుమిల్లుల వద్దకు తీసుకువెళ్ళారని ఆయన తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చేలా మాట్లాడాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రైతు ప్రతినిధులు దేవరపల్లి శివారెడ్డి, అశోక్, మల్లికార్జున, బాల అంకయ్య, మనోహర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు కొత్త రిజిస్ట్రార్

జిల్లాకు కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలిచ్చారు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలకు రిజిస్ట్రార్‌గా ఉన్న హరివర్మను నెల్లూరుజిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. కొత్త రిజిస్ట్రార్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.

# 8 నెలలుగా జీతాలు లేవు

## ఉదయగిరిలో పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన



నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ఉదయగిరి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం కార్మికులుగా పనిచేస్తున్న తమకు గత 8 నెలలుగా జీతాలు ఇవ్వకుండా పంచాయతీ అధికారులు వేధిస్తున్నారని, దీంతో తమ కుటుంబాల జీవన పరిస్థితి ఎంతో ఇబ్బందికరంగా మారిందని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనెల 18న పంచాయతీ కార్యాలయం ఆవరణలో ధర్నాందోళన చేశారు. తమకు రావాల్సిన జీతాల బకాయిలు చెల్లించాలంటూ వారు నినాదాలు చేశారు. ఈ సమస్యపై స్పందించిన కావలి డిఎల్‌పిఓ రమేష్‌బాబు వచ్చి పారిశుద్ధ్య కార్మికులతో చర్చించి పదిరోజుల్లో జీతాలు చెల్లించే ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు

## - కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి



నగరంలో పారిశుద్ధ్య పనులపట్ల అలసత్వం చూపితే సహించేది లేదని, ఎప్పటికప్పుడు పరిశుభ్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని, లేకుంటే చర్యలు తప్పవని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఇటీవల ఆమె తన కార్యాలయంలో నగర ఆరోగ్యవిభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీరు నిల్వ ఉండే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి నీరు సక్రమంగా పారుదల అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే పారిశుద్ధ్య పనులను ఏరోజుకారోజు పరిశీలిస్తున్నామని, అపరిశుభ్రంగా ఉండే డివిజన్లకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరోగ్య విభాగం అధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పలువురు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడడం మానేయండి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని శ్రీ సేవనాథమ్ ట్రస్ట్, ఆదిశంకర విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18న మనుబోలులో భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఎంతో నష్టం జరుగుతుందని, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, దాని స్థానంలో జనపనార సంచులను వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. ఆమేరకు స్థానిక తహశీల్దార్, ఎంపిడిఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఆదిశంకర కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సిఇఓ ఇమ్మాన్యుయేల్, హెచ్ఓడి ప్రొ.ప్రణయ్‌కుమార్‌లతో పాటు అనేకమంది కళాశాల విద్యార్థులు, సేవనాథం ట్రస్ట్ కోఆర్డినేటర్లు పల్లంపర్తి మహీధర్‌రెడ్డి, కావేటి భార్గవ్, సభ్యులు వెంకటశేషారెడ్డి, కోసూరు పవన్, సురేష్ లాజర్, గిరి, నితిన్, మాచిరెడ్డి యువసేన కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ర్యాలీ ప్రారంభించారు.

## సమాజాన్ని చైతన్యవంతం చేసే..

# 'వెలుగు దివ్వెలు'






రచయిత: పిల్లి హజరత్తయ్య
వెల: రూ. 150/- పేజీలు: 128
ప్రతులకు: పిల్లి హజరతయ్య
డో.నెం. 7-128ఎ, హనుమాన్‌నగర్,
సింగరాయకొండ, ప్రకాశం జిల్లా - 523101.
సెల్: 98486 06573

కష్టజీవికి రెండుపక్కలా ఉండేవాడే కవి అన్నారు మహాకవి శ్రీశ్రీ. ఇక కవే కష్టజీవి అయితే!..అందుకు ఉదాహరణే హజరత్తయ్య. చిన్ననాటి నుంచి ఎన్నో రకాల కష్టాలను కన్నీటి కాలువలను దాటుకుని ఆత్మవిశ్వాసంతో పేదరికాన్ని జయించి జీవిత సాగరాన్ని అలుపెరుగకుండా ఈదుకుంటూ ఎట్టకేలకు ఒడ్డుకు చేరుకున్న కష్టజీవి ఆయన. నిరుపేదగా ఉన్నా ఎంతో కష్టపడి చదువుకున్నారు. తెలుగులో, ఇంగ్లీషులో ఎం.ఏ చదువుకుని, బిఇడి, బిపిఇడి (పిహెచ్‌డి) కూడా పూర్తిచేశారు. స్వయంకృషితో తాను రాణించడమే కాక, తన శ్రీమతిని కూడా బిఇడి చదివించి విద్యావంతురాలిగా చేసి ప్రభుత్వోద్యోగిగా తీర్చిదిద్దిన ఘనత హజరత్తయ్యది. స్వస్థలం ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ. వృత్తిరీత్యా అదే మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కవిత్వమంటే చిన్నతనం నుంచి ఇష్టం. అదే అభిమానంతో కవితారంగంలోకి వచ్చి సమాజాన్ని చైతన్యవంతం చేసే కవితలు రాస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల వెలువరించిన 'వెలుగు దివ్వెలు' కవితాసంపుటి ఆయన కవితా ప్రతిభకు చక్కని నిదర్శనం.

*'అన్యాయం ఎదురైనా/ కష్టాలు కన్నీళ్ళు వెక్కిరించినా/ విలువలు నశిస్తున్నా/ సామాజిక దురాచారాలు శివమెత్తుతున్నా నా కలం అగ్గికణంలా మండుతుంది'*.. అంటారొకచోట. కవితా సృజనలో వాడి వేడి ఉండాలనే హజరత్తయ్య కవితావస్తువుకు ప్రేరణ సమాజంలోని సమస్యలే. అయినా ఆ సమస్యలను ఎదుర్కొని లక్ష్యసాధనతో జీవితాన్ని పండించుకోవాలంటారాయన. దేశంలో అనేకమంది బాలబాలికలు పేదరికంతో చదువుకు నోచుకోకుండా చాకిరీలో మగ్గుతుండడంపై తన ఆవేదన వ్యక్తం చేస్తూ, 'పుట్టిన పిందె..పండు కాకముందే.. కోసినట్టు' అంటూ కంటతడిపెడతాడు. మరోవైపు కని, పెంచిన పిల్లలు చివరికి తల్లిదండ్రులను ఆదరించకుండా అనాథాశ్రమాలకు పంపుతుండడాన్ని చూసి బాధపడతాడు.

*'ఆప్యాయతలు కరువై*
*ఆదరణ శూన్యమై*
*జీవితమే బరువై*
*రావణకాష్టంలా రగులుతున్న*
*జీవిత చరమాంక దశయే.. వృద్ధాప్యం'*... అంటూ వృద్ధుల బాధలను అక్షరీకరిస్తారొక చోట.

*ప్రతీకారేచ్ఛలను పక్కనబెట్టి/పంచశీల సూత్రాలను మనసున బెట్టి/ సరిహద్దు తగాదాలను వెనుకకు నెట్టి/విస్తరణ కాంక్షకు చరమగీతం పాడితే/శాంతియుత జీవనం సాకారమవుతుంది'*.. అంటారొక కవితలో. మరో కవితాఖండికలో ప్రపంచశాంతిని కోరుకుంటూ..యుద్ధాల పట్ల తన విముఖతను తెలియజేస్తారు కవి. ప్రజాహితం కోరి..ప్రజాశ్రేయస్సే పరమావధిగా ఉండాలని, మహాత్ముల జీవితాలను చదుకుని అందరూ ఆ మహనీయమైన విలువలను తెలుసుకోవాలన్నదే కవి తపన. అందుకు ప్రతీకగా 128 పేజీల ఈ పుస్తకంలో వంద కవితలున్నాయి. 'శ్రీశ్రీ కళావేదిక' ద్వారా దీనిని ప్రచురించారు. ముఖచిత్రంతో సహా పుస్తకమంతా తీర్చిదిద్దినట్లుగా బాగుంది. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డా. కత్తిమండ ప్రకాష్, ప్రముఖ సాహితీ విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు తమ ముందు మాటల్లో హజరత్తయ్య కవిత్వం చక్కగా ఉందంటూ ఆశీర్వదించారు. వాస్తవానికి ఇందులోని కవితలన్నీ సమాజానికి వెలుగు దివ్వెల వంటివే. అన్నీ ఆలోచింపజేసే కవితలే. సమాజానికి దిక్సూచీ వంటి కవితల సంపుటి ఇది. సరళమైన పదాలతో లోతైన భావాలను పలికించిన కవి.. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన కవితా సంపుటాలను వెలువరిస్తారని ఆశిద్దాం!...



సమీక్షకులు:
డా. గంగిశెట్టి శివకుమార్
94418 95343

# సిఎం ప్రకటన.. చరిత్రాత్మకం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు దాదాపు లక్షా 20వేల మందికి ప్రొబేషన్ ప్రకటిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం చరిత్రాత్మకమైన విషయమని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ఛైర్మెన్ చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ఇటీవల ఆయన నెల్లూరు సచివాలయ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి ప్రొబేషన్ మేరకు కొత్త వేతనాలు అమలుచేయనుండడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు దేవిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులను ఆదరించాలి



నిరాశ్రయులను, ఆదరణ లేని వృద్ధులను ఆదరించి మానవతా హృదయంతో వారిని అన్ని విధాలా ఆదుకోవాలని జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవసలహాదారుదు అనుముల జయప్రకాష్ అన్నారు. ఇటీవల నెల్లూరులోని పాత మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడున్న నిరాశ్రయులు పేదరికంతో బాధపడుతున్నారని, వారికి ఎలాంటి వసతులు లేవని, కనీసం వైద్యసౌకర్యాలనైనా వెంటనే కల్పించాలని కోరారు. జిల్లా పిఎంపి అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ నిరాశ్రయులకు సరైన వసతి, దుస్తులు లేవని, కొందరు అనారోగ్యంతో బాధపడుతున్నారని, పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి చేయూతనివ్వాలన్నారు. గోరంట్ల శేషయ్య, వేలూరు సుబ్బారావు, పైడా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆత్మకూరు బైపోల్

(మొదటి పేజీ తరువాయి)

విజయారావు తదితర అధికారులంతా భారీ ఏర్పాట్లు చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లందరూ ఓట్లు వేసుకునేలా అన్ని చర్యలు తీసుకున్నారు. పోలింగ్ సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం నియోజకవర్గంలో 2,13,400 మంది ఓటర్లుండగా వారి కోసం 279 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. 1339 మంది ఎన్నికల సిబ్బందిని, బందో బస్తు కోసం 1032 మంది పోలీసులను నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పెద్దసంఖ్యలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎం.సురేష్ కుమార్, జిల్లా ఎస్పీలతో కలిసి నెల్లూరు లోని తిక్కన ప్రాంగణం నుంచి పరిశీలిం చారు. ఆ తర్వాత కలెక్టర్‌తో పాటు గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ విజయారావు, అడిషనల్ ఎస్పీ చౌడేశ్వరి ఆత్మకూరు మండలంలోని కరటంపాడులో ఉన్న 98, 99 నెంబర్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మర్రి పాడు మండలం డిసిపల్లిలోని 42,43 పోలింగ్ కేంద్రాలను, సంగం మండలం లోని గాంధీ జనసంఘంలో ఉన్న 220వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు.

### ఉత్సాహంగా ప్రారంభమైన పోలింగ్ :

గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ప్రారం భంలో కాస్త మందకొడిగా ఉన్నా, ఆ తర్వాత ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సాయం త్రానికల్లా పోలింగ్ శాతం బాగా పెరి గింది. ఉదయం 9 గంటల సమయంలో 11.56 శాతం ఉన్న పోలింగ్, 11 గంట



ఉపఎన్నిక పరిశీలనకు వచ్చిన డిఐజి త్రివిక్రమ్‌వర్మతో కలెక్టర్, ఎస్పీ

లకు 24.92 శాతానికి పెరిగింది. మధ్యాహ్నం 1 గంటకల్లా 44.14 శాతా నికి చేరుకుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు 54.66 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటల సమయానికి 61.70 శాతానికి వచ్చింది. పోలింగ్ సాయంత్రం 6 గంటల దాకా జరిగింది. పోలింగ్ ముగిసే సమయానికి ఓటింగ్ శాతం 64.17కి చేరింది.



బారులు తీరిన ఓటర్లు

# కలహం దిశగా స్నేహం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ మాజీ అగ్రనేత యశ్వంత్‌సిన్హా కూడా రాష్ట్రపతి పదవి కోసం పోటీపడుతూ బరిలో దిగారు. నేటి రాజకీయాలలో ఎవరితో పోల్చుకున్నా ఆయన కొండ గుట్టల మధ్య శిఖర సమానుడు. ఆయనను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థిస్తున్నారు(ఇక్కడ కూడా అధికార ప్రకటన వెలువడాల్సి ఉంది). దీంతో ఇద్దరు ముఖ్యమంత్రులూ రాజకీయంగా విడిపోయినట్టు స్పష్టమైపోయింది.

### ఆంధ్రాపై విమర్శలు...

తెలంగాణ నేతలు అప్పుడప్పుడూ, అక్కడక్కడా జగన్‌పైనా, ఆంధ్రా ప్రభుత్వంపైనా, ఆంధ్రులపైనా నోళ్ళు పారేసుకుంటూనే ఉన్నారు.

ఇటీవల కేటీఆర్ కూడా ఆంధ్రాలోని రోడ్ల దుస్థితిని గురించి ఘాటుగానే విమ ర్శించారు. ఆ తరువాత తన మాటలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. దావోస్‌లో జరిగిన సదస్సులో జగన్ – కేటీఆర్‌లిద్దరూ కౌగిలించుకుని మరీ ఫోటోలు దిగి తమ సఖ్యతను ప్రదర్శించుకున్నారు.

ఇప్పుడు మళ్ళీ తాజాగా తెలంగాణ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి ఒక సభలో మాట్లాడుతూ 'ఆంధ్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నడు.. వాడు అడుక్కుతింటాన్డు. మనల్ని అన్నరు తెలంగాణ వస్తే మీరు అడుక్కుతింటరు అని... ఇప్పుడు ఆంధ్రోళ్ళు బిచ్చమెత్తుకు టున్నరు, రోజు నడవాలంటే కేంద్రం నుండి లోన్ రావాల వాళ్లకు, లేదంటే నడవదా రాష్ట్రం'... అంటూ ఘాటైన మాటలతో బహిరంగంగా తూలనాడడం, కేసీఆర్ మైండ్‌సెట్‌కు సంకేతాలుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ – కేటీఆర్‌లకు ముందస్తు సమాచారం లేకుండా తెరాస రాజకీయాలలో ఓ అనామకుడు ఆంధ్రా ముఖ్యమంత్రిని 'వాడు... వీడు....' అని సంబోధించే స్థాయికి వెళ్ళగలడా అన్నది కూడా పరిశీలకుల అనుమానం.

ఈ అనుమానంలో ఏమాత్రం నిజం ఉన్నా రెండు రాష్ట్రాల నేతలు, ప్రజల మధ్య పెద్ద అపార్థాలకు, అనర్థాలకు దారితీసే అవకాశాలు బలంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో దాదాపు 30 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికలను ప్రభావితం చేయగలిగిన స్థాయిలో, సంఖ్యాపరంగా ఆంధ్రా ప్రజలు ఉన్నారు. ఈ రెండు రాష్ట్రాల మధ్య వారధులుగా ఉన్న వారి మనోభావాలు గాయపడకుండా చూసుకోవలసిన బాధ్యత తెలంగాణ నేతలు, ప్రభుత్వంపై ఉందనడంలో సందేహం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ మంత్రులు, ఇతర నేతలు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతానికి రాష్ట్రపతి ఎన్నికలలో రెండు రాష్ట్రాల అగ్రనేతల దారులు వేరైనా భవిష్యత్తులో మళ్ళీ ఇద్దరూ ఒకే దారిలో నడవాలన్నది తెలుగు రాష్ట్రాల ప్రజల కోరిక. మొన్నటివరకు ఉమ్మడి కుటుంబంగా ఉన్న తెలుగువాళ్ళు కాపురాలు వేరైనా కలహాలు లేకుండా ఉండాలన్నది అందరి ఆశ.. ఆకాంక్ష..!

# శ్రీ మహాలక్ష్మీ యాగం



నెల్లూరు వేదాయపాలెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగ ణంలో కొలువైవున్న మహాలక్ష్మీ–గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆల యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 22న శ్రీ మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన వేదపండితులు కొమండూరు ఇళైయవల్లి స్థలశాయి ఆధ్వర్యంలో శాస్త్రో క్తంగా ఈ యాగాన్ని చేపట్టారు. మహ కుంభారాధన, శాత్తుమొర్రై, స్నపన తిరు మంజనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జగన్నాథం, పద్మజ, శ్రీని వాస్, భార్గవి దంపతులతో పాటు విష్ణు తేజ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అయ్యప్పస్వామి సేవాసమాజం అధ్యక్ష కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, సభ్యులు హరికిషోర్‌రెడ్డి, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

### ఈనెల 24న..

# వెంకటగిరి వైకాపా ప్లీనరీ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర స్థాయి ప్లీనరీ సన్నాహక సమావేశాల్లో భాగంగా వెంకటగిరిలో నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశాన్ని ఈనెల 24వ తేది పెద్దఎత్తున నిర్వహించనున్నామని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శుక్ర వారం ఉదయం 10 గంటలకు వెంకట గిరిలోని మధుర అకాడమీ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి నియోజక వర్గ పరిధిలోని 143 గ్రామ పంచాయ తీల సర్పంచ్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, వైస్ ఎంపిపిలు, మునిసిపల్ ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌లు, కౌన్సిలర్లు, మండల కోఆప్షన్ సభ్యులు, పిఏసిఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు, ఏఎంసి ఛైర్మెన్లు, డైరెక్టర్లు, అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు మండల ఛైర్మెన్‌లు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌లు, సభ్యులు, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లోని ఇతర ప్రముఖులు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు తరలిరావా ల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆత్మీయ స్వాగతం...



ఈ నెల 23వ తేదీ గురువారం తిరుపతి జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఇనగలూరు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న వెంకటగిరి శాసనసభ్యులు, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# విఎస్‌యులో ఉద్యోగ మేళా




నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో ఈనెల 22న ఉద్యోగమేళా నిర్వహించారు. ప్రముఖ సంస్థ హెటిరో ల్యాబ్ వారు విద్యార్థులకు ఇంటర్వ్యూలు చేశారు. 50 మంది రసాయనశాస్త్ర విద్యార్థులు, 30 మంది బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులను విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి అభినందించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విఎస్‌యులో హెటిరో సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించడం సంతోషకరమని, ఆ సంస్థ తమ విశ్వవిద్యాలయంలో ఇలాంటి కార్యక్రమాలెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయానందబాబు, రసాయనశాస్త్ర విభాగం అధిపతి డా.త్రివేణి, డా. వీరారెడ్డి, వై.విజయ, డా.మురళీకృష్ణ, డి.విరోనిక తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ మ్యాగజైన్ ఆవిష్కరణ



వాకర్స్ ప్రతినిధులు వాకర్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌ను రూపొందించి ఈనెల 22న నెల్లూరులో విజయమహల్‌గేట్ సమీపంలోని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్, వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రీజనల్ కౌన్సిలర్ ఎస్.రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి జి.లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, ట్రెజరర్ ఎన్.బల రామయ్యనాయుడు, డైరెక్టర్–ఎడిటర్ శౌరిరెడ్డి, మ్యాగజైన్ ఎడిటర్ కె.రాజగోపాల్, సబ్‌ఎడిటర్ వినుకొండ వెంకటేశ్వర్లు, ఎలెక్ట్ గవర్నర్ ఎంవి రెడ్డి, డెప్యూటి గవర్నర్ డి.పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతినెలా 1500 వాకర్స్ క్లబ్‌లకి ఈ మ్యాగజైన్‌ను క్రమం తప్పకుండా అందజేయడం జరుగుతుందని వారు ఈ సందర్భంగా చెప్పారు. వాకర్స్ క్లబ్‌ల సేవాకార్యక్రమాలను ప్రోత్సహించడంలో మ్యాగజైన్ ఎంతో తోడ్పడుతుందన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..మజ్జిగ చలివేంద్ర



నెల్లూరులోని ఏసి స్టేడియంలో వాకర్స్‌కు, శిక్షణ పొందే క్రీడాకారుల కోసం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మే 1 నుంచి జూన్ 20వ తేది వరకు 50 రోజుల పాటు మజ్జిగ చలివేంద్ర నిర్వహించారు. ఈనెల 20న జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎం.వి సుబ్బారెడ్డిలు పాల్గొని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీచేశారు. దాతల ప్రోత్సాహంతో దాదాపు రెండు లక్షల రూపాయల వ్యయంతో ఈ చలివేంద్ర నిర్వహించడం జరిగిందని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, దాసరాజు సత్యనారాయణ, రావూరు సుబ్బారావు, నజీర్ అహ్మద్, పి.శ్రీనివాసులు, బుజ్జయ్య, వినుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడలో నిత్యాన్నదానానికి.. 5 లక్షల విరాళం

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన దాత డి.పాండు రంగయ్య ఈనెల 20న 5 లక్షల రూపాయలు విరాళంగా సమర్పించారు. ఆలయ ఛైర్మెన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ డి.వెంకటేశ్వర్లుకు ఆ మొత్తాన్ని ఆయన అందజేశారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించి దాతను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. అమ్మవారి గర్భాలయం బంగారు తాపడం కోసం ఆ దాత 8 లక్షల రూపాయలు విరాళంగా అందజేయను న్నారని ఈ సందర్భంగా ఛైర్మెన్ తెలిపారు.

### మూఢనమ్మకాలకు...

## ఆ పాప..'బలై' పోయింది

- తండ్రి ఘాతుకానికి కన్నబిడ్డ కన్నుమూత
- నాన్న, నాన్నమ్మ ఇద్దరూ అరెస్ట్



పునర్విక (ఫైల్‌ఫోటో)



మూఢనమ్మకం ఒక పసిబిడ్డ చావుకు కారణమైంది. పున్నమినాడు దేవుడికి పసిబిడ్డను బలి ఇస్తే అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయనే మూఢవిశ్వాసంతో, కనీస జ్ఞానం కానీ, మానవత్వం కానీ లేని ఆ ఉన్మాది తండ్రి చేతిలో నాలుగేళ్ళ బిడ్డ ప్రాణాలు పోగొట్టుకుంది. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని పేరారెడ్డిపల్లిలో ఇటీవల జరిగిన ఈ దారుణ సంఘటనలో నిందితులైన తండ్రిని, అందుకు ప్రేరేపించి సహకరించిన ఆ పాప నాన్నమ్మని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్మకూరు సిఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ శివశంకరరావు ఈనెల 20న ఈ ఘటన గురించి విలేకర్లకు తెలిపారు. వారి వివరాల మేరకు.. వేణుగోపాల్-యామినిలకు ఇద్దరు ఆడపిల్లలు. వారిలో పునర్విక నాలుగేళ్ళ చిన్నారి. ఈ నేపథ్యంలో వేణుగోపాల్ మూఢనమ్మకంతో సామాజిక మాధ్యమాలను శోధించి క్షుద్రపూజల గురించి తెలుసుకున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం పాపను బలి ఇస్తే ఐశ్వర్యం వస్తుందనే మూర్ఖత్వంతో ఈనెల 15న పౌర్ణమి రోజున చిన్నకుమార్తె అయిన పునర్వికను ఇంట్లో పూజగదిలో కూర్చోబెట్టి క్షుద్రపూజలు చేయడం ప్రారంభించాడని, అందుకు తల్లి దొరసానమ్మ కూడా సహకరించిందని పోలీసుల విచారణలో బయటపడినట్లు సిఐ తెలిపారు. వేణుగోపాల్ పూజచేస్తూ, పునర్వికను పడుకోబెట్టి నోట్లో కుంకుమపొడి కుక్కి గొంతునులుముతుండగా చిన్నారి భయంతో వేసిన కేకలకు చుట్టుపక్కల వారు వచ్చి పునర్వికను వెంటనే మేనమామ సాయంతో ఆసుపత్రికి తరలించారని సిఐ తెలిపారు. ఈ సందర్భంలో దొరసానమ్మ చుట్టుపక్కల వారిని ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుపడిందని, వారు నిలదీయడంతో వేణుగోపాల్ ఇంట్లోంచి బయటకు వచ్చాడని, అయితే అప్పటికే ఆ పాప స్పృహ తప్పిపోయిందని, ఈనెల 16న ఆత్మకూరు, నెల్లూరుల్లో వైద్యానికి తరలించారని, అక్కడి నుంచి చెన్నైలో ఆ పాప చికిత్సపొందుతూ మరణించిందని చెప్పారు. దీంతో పోలీసులు ఈ ఘటనను హత్యకేసుగా నమోదుచేశారు. జిల్లా ఎస్పీ విజయరావు, అడిషనల్ ఎస్పీ హిమవతి పర్యవేక్షణలో డిఎస్పీ కె.వెంకటేశ్వరరావుతో పాటు సిఐ, ఎస్ఐలు వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితులిద్దరినీ అరెస్ట్ చేశారు. ఈ కేసును వేగంగా దర్యాప్తు చేసినందుకు డిఎస్పీ వెంకటేశ్వరరావు పోలీసు సిబ్బందిని అభినందించారు.

## 'సింహపురి రైతు' రజతోత్సవ వేడుకలు.. 30న

నెల్లూరులోని 'సింహపురి రైతు' మాసపత్రిక 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల 30వ తేది సాయంత్రం 5 గంటలకు నగరంలోని టౌన్‌హాలులో సిల్వర్‌జూబ్లీ వేడుకను నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా రజతోత్సవ సంచికను ముఖ్యఅతిథి, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని రైతు సంఘం నాయకుడు చిరసాని కోటిరెడ్డి తెలిపారు. ఈ వేడుకలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌ఛైర్మెన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డా.ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జేసీ హరేందిరప్రసాద్, రాష్ట్ర రైతుసంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షులు పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జెకెరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధర్, అక్వా రైతు నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సామంతు గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.సుధాకర్‌రాజు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# వెంకయ్య విషయంలో.. అనుకున్నదే అయ్యింది!

రాష్ట్రపతి పదవికి ఉప రాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును భాజపా ఎంపిక చేయకపోవచ్చునని మోదీ-షా ద్వయం శైలిని తొలి నుంచీ గమనిస్తున్నవారు అంచనా వేస్తూనే ఉన్నారు. చివరకు అదే నిజమైంది.

నిజానికి, మోదీకి వెంకయ్యనాయుడు గట్టి మద్దతుదారు. పార్టీలో ఆయన చాలా సీనియర్, అయినప్పటికీ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీకి అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న వాజపేయి నుంచి ఇబ్బంది ఎదురైనప్పుడల్లా వెంకయ్యనాయుడు ఆయనకు అండగా నిలబడ్డారు. ప్రధానమంత్రి అభ్యర్ధిగా నరేంద్ర మోదీని ప్రమోట్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. మోదీ కోసం తన గురువైన ఎల్‌కే అద్వానీని సైతం పక్కనపెట్టారు. అయినప్పటికీ, వెంకయ్యనాయుడును రాజకీయంగా మోదీ విశ్వసించలేదు.

2014లో మోదీ ప్రధాన మంత్రిత్వం కోసం వెంకయ్యనాయుడు 'చాయ్ పే చర్చ' అంటూ విస్తృత ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం మోదీ క్యాబినెట్‌లో మంత్రిగా అవకాశం పొందారు.

నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయినప్పటినుంచీ ఆంధ్రప్రదేశ్ పట్ల అసహనం ప్రదర్శిస్తూ వస్తుంటే... వెంకయ్యనాయుడు మాత్రమే రాష్ట్ర అవసరాల పట్ల గట్టిగా స్పందిస్తూ వచ్చారు.

రాష్ట్రానికి 'ప్రత్యేకహోదా' విషయంలో కాంగ్రెస్‌పార్టీ 5సంవత్సరాలు ఉండాలని అంటే.. కాదు... కాదు, 10 సంవత్సరాలు ఉండాలి అని గట్టిగా వాదించిన నాయుడు, ప్రధాని మోదీ వైఖరితో ఇరుకులో పడిపోయారు. ఆంధ్రులకు.... మోదీకి మధ్యలో నలిగిపోయారనే చెప్పాలి. అయినప్పటికీ, ఢిల్లీలో 'తెలుగు గొంతు'గా వెంకయ్యనాయుడు చురుకుగా వ్యవహరించడం ప్రధాని మోదీకి నచ్చలేదు.

2014 ఎన్నికలకు చాలా ముందునుంచే, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుపై నరేంద్ర మోదీ అసహనంతో ఉన్నారు. అయితే, 2014 ఎన్నికల్లో పూర్తి మెజారిటీ వస్తుందో... రాదో అన్న సందేహంతో చంద్రబాబు నాయుడుతో అవసరానికి మించిన ప్రేమను మోదీ ప్రదర్శించారు. సభల్లో పక్కనే కూర్చో బెట్టుకుని, బాబును పొగడ్తల్లో ముంచెత్తారు, ఆ ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రావడంతో చంద్రబాబు అవసరం మోదీకి లేకుండా పోయింది. దాంతో, బాబుకి చుక్కలు చూపించడం ప్రారంభించారు.




గుజరాత్‌లో గోద్రా అల్లర్ల సమయంలో ముస్లింలను ఊచకోత కోసిన ఘటనలో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణలను పెద్దఎత్తున ఎదుర్కొన్నారు.

మోదీ, ముఖ్యమంత్రి హోదాలో 'రాజధర్మం' పాటించలేదనే ఆవేదనకు లోనైన అప్పటి ప్రధాని వాజపేయి, గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీని రాజీనామా చేయించాలని భావించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాజపేయికి మద్దతుగా నిలబడ్డారు. మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడమే కాక, మోదీ ఆంధ్రప్రదేశ్‌కి వస్తే, అరెస్ట్ చేయిస్తాను అని ముఖ్యమంత్రి హోదాలో బహిరంగంగా ప్రకటించారు.

2014 ఎన్నికల్లో సైతం, మోదీతో వేదిక పంచుకోడానికి చంద్రబాబునాయుడు చాలా తటపటాయించారు. అయినా, ఎన్నికల అనంతరం అవసరం పడుతుందేమో అన్న అనుమానంతో మోదీయే చంద్రబాబుతో రాసుకు పూసుకు తిరిగారు.

ఎన్నికల్లో బీజేపీకి పూర్తి ఆధిక్యత లభించింది. ఇక, చంద్రబాబుతో తనకు అసలు పని లేదని స్పష్టమైంది.

మోదీ అంటే ఏమిటో ఇక అప్పటినుంచి చంద్రబాబుకు అర్ధమవడం మొదలైంది.

ఎన్నికలలో గెలిచినప్పటికీ ఢిల్లీలో పూర్తి మెజారిటీతో మోదీ అధికారంలోకి రావడంతో ఇరుకులో పడిపోయిన చంద్రబాబునాయుడు వీలైనంత అణుకువగా వ్యవహరిస్తూ వచ్చారు. మోదీ పట్టించుకోలేదు.

2000వ సంవత్సరం నాటి చంద్రబాబు దూకుడు రాజకీయ వ్యవహారశైలిని మోదీ మరిచిపోలేదు.

ఆ విషయాన్ని గమనించినప్పటికీ, అదేమీ బయటకు కనపడనీయకుండా చంద్రబాబు వ్యవహరించడం ప్రారంభించారు.

రాజధాని నగర శంకుస్థాపనకు మోదీని ఆహ్వానించడమే గాక ఆయన రాకను అదేదో బ్రిటిష్ విక్టోరియా మహారాణి వస్తున్నంత రాష్ట్ర వ్యాప్త వేడుకగా చంద్రబాబు నిర్వహించారు. మోదీ మాత్రం, గుప్పెడు మట్టి.... చెంబుడు నీళ్లు తెచ్చి చంద్రబాబు చేతిలో పెట్టి, ఓ చిరునవ్వు నవ్వి వెళ్లిపోయారు. అది కూడా ఓ మహద్భాగ్యం అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరించారు. ఏమాత్రం బయటపడలేదు.

చంద్రబాబుపై తన మనసులో దాదాపు 14, 15 సంవత్సరాలుగా పేరుకుపోయిన అసహనం.. ఆగ్రహం.. అసంతృప్తిని రాజధాని శంకుస్థాపన సమయంలో మోదీ అలా చూపించారు.



'అటువంటి' చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్‌కు ఢిల్లీలో... తన మంత్రి వర్గంలో అండగా ఉంటున్న వెంకయ్యనాయుడు వ్యవహారశైలి మోదీకి నచ్చడం లేదనే విశ్లేషణలు కూడా 2016 ప్రాంతాలలో వెలువడ్డాయి.

ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలో కనిపించిన ఏకైక అండ వెంకయ్యనాయుడు. 'పదేళ్ల ప్రత్యేకహోదా' అంటూ పదే పదే ప్రకటించి కూడా ఏమీ చేయలేక పోతున్నామే అన్న అంతర్మధనంలో పడిపోయిన వెంకయ్యనాయుడు ఆంధ్రకు ఏదో ఒక సాయం చేయాలనే భావనలో ఉండేవారు. 'నేను ఢిల్లీ నుంచి ఆంధ్రకు వట్టి చేతుల్తో రాను. ఏదో ఒకటి తీసుకొస్తూనే ఉంటాను...' అని ఆయనే ఓసారి చెప్పారు. ఆంధ్రకు ఢిల్లీలో కొండంత అండగా ఉన్న వెంకయ్యనాయుడును 'అచేతనం' చేయడానికి 2017లో ఖాళీ అవుతున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులు మోదీకి అంది వచ్చాయి. 2017లో ఉప రాష్ట్రపతి పదవి అనే సర్వాంగ సుందరమైన బోనులోకి వెంకయ్యనాయుడును పంపించి, దానికి బయటి నుంచి తాళం వేసేశారు. ఆ విధంగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ అవసరాలకు కేంద్రానికి ఉన్న 'లైఫ్ లైన్'ను మోదీ కట్ చేశారు.

ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడుపై రివెంజ్ తీర్చుకుంటున్న మోదీ, చంద్రబాబుకు ఢిల్లీలో అండగా ఉంటున్న వెంకయ్యనాయుడుపై ఆ విధంగా 'స్వీట్ రివెంజ్' తీర్చుకున్నారు.

ఈ నేపథ్యంలో ఇప్పుడు, 2022లో రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా వెంకయ్యనాయుడు అభ్యర్థిత్వాన్ని మోదీ పరిశీలిస్తారని ఢిల్లీలోని తెలుగు పరిశీలకులు భావించలేదు. చివరి నిముషం వరకు సస్పెన్స్ కొనసాగించి చివరికి తన సొంత అభ్యర్థి పేరును ప్రకటించారు.

దీనికి తోడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన'రెడ్డి' కూడా వెంకయ్య'నాయుడు' పట్ల అంత సుహృద్భావంతో లేని విషయం రాజకీయవర్గాలలో రహస్యం ఏమీ కాదు. అటువంటి జగన్మోహన్‌రెడ్డి, నరేంద్ర మోదీతో సన్నిహితంగా ఉంటున్నారు.

వెంకయ్యనాయుడు రాష్ట్రపతి అయితే, చంద్రబాబునాయుడుకు ఢిల్లీలో కొంచెం గాలి ఆడుతుందని జగన్మోహన్‌రెడ్డి - ప్రధానమంత్రికి చెప్పే ఉంటారని రాజకీయ వర్గాలలో ఓ అంచనా ఉంది. రాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించడానికి వైసీపీ ఓట్లే కీలకం. జగన్ చేతిలో ఏకంగా 45 వేలకు పైబడి ఓట్లు ఉన్నాయి.

ఇవన్నీ కలిసి, వెంకయ్యనాయుడు అభ్యర్థిత్వానికి అడ్డు పడతాయని ఊహించినట్టుగానే, అడ్డు పడ్డాయి.

మరో ఏడు రోజుల్లో 73వ జన్మదిన దినం(జులై 1) జరుపుకోబోతున్న వెంకయ్యనాయుడు పదవీ కాలం మరి కొద్ది రోజుల్లో ముగింపుకు రానుంది.

దీంతో, దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తెలుగు గొంతు రాజకీయంగా దాదాపు మూగబోయినట్టుగానే భావించవచ్చు. తెలుగు పండుగలు ఉగాది, సంక్రాంతి వేడుకలు ఇక ఢిల్లీ పవర్ కారిడార్లలో కనిపించవు.

పదవీ విరమణ చేసిన తరువాత వెంకయ్యనాయుడు ఏమి చేస్తారు? సమయాన్ని ఎలా వెచ్చిస్తారు అనేది ఆసక్తికరం. ఎందుకంటే.. మనుషుల్లో తిరగడం, మనుషుల్లో కలిసి ఉండడం, మనుషుల్తో మాట్లాడుతూ ఉండడం ఆయనకు అత్యంత ప్రీతికరం.

ఓ రాష్ట్ర మంత్రి పదవి, ఓ ఈశాన్య రాష్ట్రానికి గవర్నర్‌గా చేసిన బీజేపీకి చెందిన ద్రౌపది ముర్ము అనే గిరిజన మహిళ భారత రాష్ట్రపతి కాబోతున్నారు. ఒక గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం దేశ చరిత్రలో నిలిచిపోతుంది. గిరిజన మహిళను దేశ అత్యున్నత పదవికి ఎంపిక చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దేశ చరిత్రలో నిలిచిపోతారు.

దీనివల్ల, గిరిజన సమస్యలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టి, వారి సమస్యలను 'చిత్తశుద్ధి' తో ఇప్పటికైనా పరిష్కరించడానికి కృషి చేస్తే, ప్రధాన మంత్రి సదుద్దేశం నెరవేరినట్టే.


- భోగాది వేంకట రాయుడు

### రాష్ట్రపతి ఎన్నికల్లో.. ఎన్డీఏ అభ్యర్థిగా

# ఆదివాసీ మహిళకు తొలిసారిగా అవకాశం

- ఒడిశాకు చెందిన ద్రౌపది ముర్మును అభ్యర్థిగా ప్రకటించిన బిజెపి
- విపక్షాల అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా





ఎన్డీఏ తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా ఒడిశాకు చెందిన ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము ఎంపికయ్యారు. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ఆదివాసీ మహిళకు రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లభించడం ఎంతో విశేషం. ఒడిశాలో మంత్రిగా, జార్ఖండ్ గవర్నర్‌గా కూడా పనిచేసిన విశేషప్రతిభాశాలి ఆమె. నిబద్ధతకు, నిరాడంబరత్వానికి మారుపేరు. ఉపాధ్యాయురాలిగా జీవితం ప్రారంభించిన ఆమె ఆ తర్వాత రాజకీయరంగ ప్రవేశం చేసి రాయ్‌రంగపూర్ ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికయ్యారు. 2000-02 సంవత్సరాల్లో ఒడిశా రవాణా, వాణిజ్యశాఖల మంత్రిగా, పశుసంవర్ధకశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2015లో జార్ఖండ్‌కు మొదటి మహిళా గవర్నర్‌గా నియమితులయ్యారు. 2021దాకా పూర్తికాలం గవర్నర్‌గా పనిచేశారు. అట్టడుగు వర్గాల ప్రజలకు అపారమైన సేవలు చేశారు. ద్రౌపది ముర్ము అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశాక ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ 'ముర్ము తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేశారని, బడుగు బలహీనవర్గాల ప్రజల సముద్ధరణకు కృషిచేశారని' పేర్కొన్నారు.

### విపక్షాల అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా:

రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ సహా విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా మాజీ కేంద్రమంత్రి యశ్వంత్‌సిన్హాను రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి నిలిపినట్లు విపక్షాలు ప్రకటించాయి. బీహార్ రాజధాని పాట్నాలో ఆయన జన్మించారు. అధ్యాపకునిగా జీవితం ఆరంభించి ఐఏఎస్ అధికారిగా ఉన్నతస్థానం పొందారు. రాజకీయరంగంలోకి వచ్చాక కేంద్రమంత్రిగా కూడా పదవులు పొందారు. మంచి సమర్థవంతమైన నాయకుడిగా యశ్వంత్‌సిన్హా పేరు తెచ్చుకున్నారు. జులై 18న రాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్నాయి.

# 'విశ్వసాయి'.. విజయకేతనం

## ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



ఇంటర్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తమ మార్కులతో రాణించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో పి.హృతిక్‌రెడ్డి 470 మార్కులకు 465 మార్కులు, జి.వెంకటరిషిత 464 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. బైపిసిలో షేక్ గ్రీష్మ 440 మార్కులకు 434 మార్కులు, డి.జాహ్నవి 433 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ ఎంఇసి విభాగంలో 500 మార్కులకు ఇవి రుష్మిత 481 మార్కులతో, జి.లక్ష్మీలహరి 464 మార్కులతో ఉత్తమశ్రేణిలో రాణించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఫలితాల్లో కూడా అనేకమంది తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని, ఎంతో ప్రతిభాపాటవాలతో రాష్ట్రస్థాయిలో అగ్రగాములుగా నిలుస్తూ కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నారని అంటూ విద్యార్థులందరికీ విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా.ఎం.సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటర్‌లో కృష్ణచైతన్య హవా



ఈనెల 22న ప్రకటించిన ఇంటర్‌మీడియట్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపుల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఎంఇసిలో ఎస్.సాయిప్రణతి 500 మార్కులకు 477 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలవడం విశేషం. జూనియర్ ఎంపిసిలో నలుగురు విద్యార్థులు కె.దేవి సాయి సుష్మిత, ఏ. మానస, ఎస్‌కె షరీన్, టి.భానుప్రకాష్‌లు 470 మార్కులకు 463 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. అదేవిధంగా బైపిసిలో 440 మార్కులకు ఎస్.చైతన్యస్రవంతి 431, వి.తనూజ 430 మార్కులు సాధించారు. ఎంపిసిలో 460 మార్కులకు పైగా 14 మంది, 450 మార్కులకు పైగా 47 మంది విద్యార్థులు, 95శాతం కంటే ఎక్కువగా 65 మంది విద్యార్థులు, 90 శాతం కంటే ఎక్కువగా 155 మంది విద్యార్థులు మార్కులు సాధించడం సంతోషకరమని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. సీనియర్ ఇంటర్‌లోనూ బైపిసిలో ఎం.డి జనైరా 1000 మార్కులకు 980 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సీనియర్ ఎంపిసిలో పి.శ్రీవైష్ణవి 978 మార్కులు, కె.పూజిత 978 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఎంఇసిలో జివి సమీరా 1000 మార్కులకు 970 మార్కులు తెచ్చుకుని అందరి అభినందనలు పొందింది. తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో రాణించడం పట్ల కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులను, ప్రిన్సిపాల్స్‌ను, విద్యార్థులను, తల్లితండ్రులను వారు అభినందించారు. కళాశాల డీన్ రామాంజనేయరెడ్డి, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్‌డీన్ ఉమాపాల్గొన్నారు.

ప్రశంసనీయం ఆయన నిరంతర సేవా ప్రస్థానం
సముచితనీయం రాజ్యసభలో ఆయనకు స్థానం
మనసెరిగిన నేత, అలుపెరుగని దాత
బీద మస్తాన్‌రావు గారికి
అభినందన శుభాకాంక్షలు.



GOGAADI
ANYTHING & EVERYTHING ABOUT YOUR GAADI
81 8605 8605

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com